

జీవించేందుకే మనిషి తినాలి

సమాజ సంక్షేమానికి జీవించాలి

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :


janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 278 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 22-04-2025 | పేజీలు : 6


# పోప్ ఫ్రాన్సిస్ అస్తమయం

- ప్రజలకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపిన మరుసటి రోజే తుదిశ్వాస విడిచిన పోప్
- శ్వాసకోశ సమస్యలతో ఇటీవల ఆస్పత్రిలో..
- మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం





**వాటికన్ సిటీ, న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 21 (జనస్వరం) :** క్యాథలిక్ మతపెద్ద, రోమ్ బిషప్ పోప్ ఫ్రాన్సిస్(88) ఇక లేరు. ఆదివారం ఈస్టర్ సందేశం ఇచ్చిన ఆయన ఇటలీ కాలమానం ప్రకారం.. సోమవారం ఉదయం 7.35 గంటలకు వాటికన్ సిటీ లోని తన కాసా శాంటా మార్టా నివాసంలో తుది శ్వాస విడిచారని వాటికన్ ప్రకటించింది. ఫ్రాన్సిస్ శ్వాసకోశ సమస్యలు, డబుల్ న్యూమోనియాతో ఫిబ్రవరి 14న ఆస్పత్రిలో చేరి 38 రోజుల పాటు చికిత్స తీసుకున్నారు. ఆపై కోలుకుని డిశ్చార్జి అయ్యారు. ఆదివారం సెయింట్ పీటర్ స్క్వేర్‌లో ప్రజలకు స్వయంగా ఈస్టర్ శుభాకాంక్షలు కూడా చెప్పారు. భక్తులకు ఈస్టర్ సందేశం ఇచ్చారు. మరుసటి రోజే ఆయన ప్రాణాలు కోల్పోయారు. గుండె పోటుతో ఆయన మరణించినట్లు ఇటలీ వార్త సంస్థలు పేర్కొంటున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన రాలేదు. కాగా, ఈస్టర్ సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్.. పోప్ ఫ్రాన్సిసను కలిశారు. ప్రధాని మోదీ 2021, 2024లో ఫ్రాన్సిసను కలిసి భారతదేశానికి ఆహ్వానించారు. పోప్ ఫ్రాన్సిస్ వచ్చే ఏడాది భారతదేశానికి రావాల్సి ఉండగా, ఇంతలోనే ఆయన మరణించడం బాధాకరం. కాగా, ఫ్రాన్సిస్ మృతి పట్ల భారత ప్రభుత్వం మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. మంగళవారం, బుధవారం, అలాగే ఫ్రాన్సిస్ అంత్యక్రియలు నిర్వహించే రోజు సంతాప దినాలుగా పాటించాలని తెలిపింది. కాగా, 1937లో పోప్ ఫ్రాన్సిస్ అర్జెంటీనాలో జన్మించారు. పోప్ బెనడిక్ట్ తర్వాత 2013లో ఫ్రాన్సిస్ 266వ పోప్‌గా బాధ్యతలు చేపట్టారు. ఫ్రాన్సిస్ ప్రజల పోప్‌గా పేరు తెచ్చుకున్నారు. పోప్ ఫ్రాన్సిస్ సామాజిక అంశాలపై ఆయన మాట్లాడుతుండే వారు. కాగా, దక్షిణ అమెరికా నుంచి పోప్‌గా ఎన్నికైన తొలి వ్యక్తి ఫ్రాన్సిస్ కావడం విశేషం. పోప్ అంత్యక్రియల ప్రక్రియలో ఫ్రాన్సిస్ కొంతకాలం క్రితం కొన్ని మార్పులు చేశారు. వాటికన్ సిటీ వెలుపల కూడా పోప్‌ను సమాధి చేసేలా ఆయన మార్పులు చేశారు. ఫ్రాన్సిస్ తనను బాసిలికా ఆఫ్ శాంటా మరియా మ్యాగోరియాలో సమాధి చేయాలని కోరుకున్నారు. పోప్ మరణాన్ని ధ్రువీకరించిన తర్వాత ఆయన ఉంగరాన్ని ధ్వంసం చేస్తారు. పోప్ పార్థివ దేహాన్ని బాసిలికా ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. ఆపై ఆచారాల ప్రకారం పోప్ పార్థివదేహాన్ని ఖననం చేస్తారు. పోప్ చనిపోయిన తర్వాత 4 నుంచి 6 రోజుల్లో అంత్యక్రియలు పూర్తిచేస్తారు. అంత్యక్రియల తర్వాత 9 రోజులు సంతాప దినాలు పాటిస్తారు. అవి పూర్తయ్యాక తదుపరి పోప్ ఎన్నిక ప్రక్రియ మొదలు పెడతారు. పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల భారత్ క్యాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్‌తో పాటు ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, విదేశాంగ మంత్రి జైశంకర్, ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్ తదితరులు సంతాపం ప్రకటించారు. ఫ్రాన్సిస్ మరణంతో తదుపరి పోప్ ఎవరనే చర్చ మొదలైంది. తదుపరి పోప్ రేసులో ఇటలీకి చెందిన 70ఏళ్ల కార్డినల్ పిట్రో పెరోలిన్, డెమెక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోకు చెందిన 65ఏళ్ల కార్డినల్ ఫ్రీడోలిన్ అంబోంగో బెసుంగు, ఇటలీకి చెందిన 69ఏళ్ల కార్డినల్ మెట్టో పేర్లు వినిపిస్తున్నాయి.


**పోప్ ఎంపిక విధానం?**


పోప్ ఎన్నికకు రహస్య ఓటింగ్ నిర్వహిస్తారు. 80 ఏళ్ల లోపు వయసున్న కార్డినల్స్ ఈ ఓటింగ్‌లో పాల్గొంటారు. మొత్తం 252 మంది కార్డినల్స్‌లో 138 మందికి ఓటింగ్‌లో పాల్గొనే అర్హత ఉంది. రోజుకు నాలుగు రౌండ్ల ఓటింగ్ చొప్పున ఎవరైన అభ్యర్థికి మూడింట రెండొంతుల మెజారిటీ వచ్చేవరకు ఓటింగ్ జరుగుతుంది. ప్రతి సెషన్‌లో బ్యాలెట్ పేపర్లకు నల్లటి పొగ వెలువడే రసాయనాలు కలిపి కాల్చుతారు. ఆ సమయంలో ఏ అభ్యర్థి పేరు బ్యాలెట్ పేపర్ కాల్చుతుండగా తెల్లటి పొగ వస్తుందో ఆ అభ్యర్థి పోప్‌గా ఎన్నికైనట్లు. పోప్ ఎన్నికలో ఆరుగురు భారత కార్డినల్స్‌కు ఓటు వేసే అర్హత ఉంది. వారు కార్డినల్ ఫలిప్ నెరీ ఫెర్రో(72), కార్డినల్ క్లెమిస్ బెసిలియోస్(64), కార్డినల్ అంథోని పూల(63), కార్డినల్ జార్జ జాకోబ్ కూవకడ్(51), కార్డినల్ ఓస్వల్డ్ గ్రెసియస్(80), కార్డినల్ జార్జ అలెంచెరీ(79).

## 26, 29 తేదీల్లో నగరానికి ముఖ్యమంత్రి

**విశాఖపట్నం, ఏప్రిల్ 21 (జనస్వరం) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 26న ఒకసారి, 29న మరొకసారి నగరానికి రానున్నారు. 26వ తేదీన ఆయన విశాఖపట్నం వచ్చి, హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా వెళతారు. అక్కడ 'మత్స్యకార భరోసా' పథకం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. లబ్ధిదారులకు చెక్‌లు అందజేస్తారు. కార్యక్రమం ముగిసిన తరువాత తిరిగి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ఇక్కడ నుంచి విజయవాడ వెళతారు. అలాగే ఈనెల 29వ తేదీ రాత్రి సతీసమేతంగా సీఎం నగరానికి రానున్నారు. ఈనెల 30వ తేదీన సింహాచలం వరాహ నరసింహస్వామి చందనోత్సవం సందర్భంగా స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

**నేడు అమిత్ షాతో చంద్రబాబు భేటీ!**





వ్యక్తిగత పర్యటన నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి విదేశాలకు వెళ్లిన ఆయన సోమవారం అర్ధరాత్రి దిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, సానా సతీష్, పార్టీ సీనియర్ నేత కంభంపాటి రామ్మోహన్‌రావు తదితరులు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఉదయం రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు, ప్రాజెక్టుల గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్‌ను కలవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఆ స్థానం నుంచి ఎవరు పోటీ చేయాలన్నదానిపై అమిత్ షాతో చర్చించే అవకాశం ఉంది. అమరావతి పునర్నిర్మాణానికి శంకుస్థాపన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల 2న అమరావతికి వస్తున్న నేపథ్యంలో అందుకోసం చేస్తున్న ఏర్పాట్ల గురించి చంద్రబాబు కేంద్ర హోం మంత్రికి వివరించనున్నట్లు సమాచారం. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని తీర్మానించి పంపిన నేపథ్యంలో దాని పురోగతి గురించి న్యాయ శాఖ మంత్రితో చర్చించే వీలుంది.

# నమో.. అమరావతి!

- మే 2న రాజధానిలో పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన
- హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోదీ
- 111 ఎకరాల్లో చురుగ్గా సభా ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లు
- 28 ఎకరాల విస్తీర్ణంలో సభా ప్రాంగణం
- వీఐపీలకు నలువైపులా 83 ఎకరాల్లో పార్కింగ్ ప్లేస్‌లు

**అమరావతి, ఏప్రిల్ 22 (జనస్వరం) :** రాజధాని అమరావతిలో మే 2న జరిగే రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన సభ ఏర్పాట్లు 111 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో చురుగ్గా సాగుతున్నాయి. వెలగపూడి సచివాలయం వెనుక భాగంలో నైరుతి దిక్కున ప్రధాని నరేంద్ర మోదీ రాక కోసం సభా ప్రాంగణం సిద్ధం చేస్తున్నారు. ఇది 28 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ఇక్కడ ప్రధాన వేదిక, సాంస్కృతిక వేదిక, గ్యాలరీలు ఏర్పాటు చేస్తారు. ఈ సభా ప్రాంగణానికి తూర్పు, పడమర, ఉత్తర దిక్కులలో పార్కింగ్ కోసం భూములను కేటాయించారు. మొత్తం తొమ్మిది పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నారు. సభా ప్రాంగణం తూర్పు వైపు అంటే సచివాలయానికి దక్షిణ వైపు వస్తుంది. ఈ ప్రాంతంలో బస్సుల పార్కింగ్ కోసం 15 ఎకరాలను కేటాయించారు. దీని పక్కనే కార్ల కోసం 27 ఎకరాల పార్కింగ్ స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ రెండు పార్కింగ్ స్థలాలకు మధ్యన రోడ్డు ఉంటుంది. సభా ప్రాంగణానికి పడమర దిక్కున వీఐపీల వాహనాల పార్కింగ్ కోసం 10 ఎకరాలను కేటాయించారు. సభా ప్రాంగణానికి అభిముఖంగా అంటే ఉత్తర దిక్కున సచివాలయానికి నైరుతి, పశ్చిమ దిశలలో 32 ఎకరాలలో వీఐపీల పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం తొమ్మిది పార్కింగ్ ప్లేస్‌లు ఏర్పాటు చేస్తుండగా.. 6, 7, 8, 9 పార్కింగ్ ప్లేస్‌లన్నీ కూడా సభా ప్రాంగణానికి సమీపంలో ఉంటాయి. మిగిలిన 1 నుంచి 5 పార్కింగ్ ప్లేస్‌లన్నీ కూడా సాధారణ జనాలకు కేటాయించారు. ఇవి సభా ప్రాంగణానికి దూరంగా ఉంటాయి. వీటిని ఇంకా ఖరారు చేయలేదు. సాధారణ ప్రజలంతా నడుచుకుంటూ సభా ప్రాంగణానికి రావాల్సి ఉంటుంది. మునిసిపల్ మంత్రి నారాయణ చెబుతున్న దాని ప్రకారం ఐదు లక్షల మంది వరకు సభకు హాజరయ్యే అవకాశం ఉంటుంది కాబట్టి.. పార్కింగ్ బయటే ఇచ్చే అవకాశం ఉంది.

**సభా ప్రాంగణానికి దగ్గరగా హెలీప్యాడ్ :**

ప్రధానమంత్రి మోదీ దిగటానికి వీలుగా సచివాలయం వాయువ్య దిక్కున హెలిప్యాడ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం మూడు హెలీప్యాడ్లను ఇక్కడ సిద్ధం చేస్తున్నారు. ప్రధాన మంత్రి, ఆయన భద్రతా సిబ్బంది, ఇతర ప్రముఖులు హెలీప్యాడ్‌లలోనే దిగనున్నారు.


**హెలీప్యాడ్ నుంచి సభాప్రాంగణం వరకు రోడ్డు షో :**

ప్రధాని మోదీ దిగే హెలీప్యాడ్ నుంచి సభాప్రాంగణం వరకు మాత్రమే రోడ్డు షో నిర్వహించాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. రోడ్డు షోలో ప్రధాని మోదీతో పాటు సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాత్రమే పాల్గొంటారు.

**జెట్ స్పీడ్‌తో సభా ప్రాంగణ పనులు :**

అమరావతిలో జెట్ స్పీడ్‌తో సభా ప్రాంగణంలో పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా మూడు వేదికల పనులు శరవేగంగా చేస్తున్నారు. ఒక్క రోజు వ్యవధిలోనే మూడు గ్యాలరీల పనులు తుది దశకు చేరుకున్నాయి. ఒక గ్యాలరీకి సంబంధించి పైకప్పు వేశారు. రెండింటికీ పైకప్పు పనులు మిగిలి ఉన్నాయి. వర్షం వచ్చిన తడవకుండా ఉండేలా వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు ఏడీసీఎల్ అధికారులు అమరావతి ప్రాంతంలో వీఐపీలు రాకపోకలు సాగించే రోడ్లన్నింటినీ బాగు చేస్తున్నారు. కొత్తగా బీటీ లేయర్లు వేస్తున్నారు. రోడ్డు పక్కన మొక్కలు నాటుతున్నారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ : 22 ఏప్రిల్ 2025,**

**తిథి : శుద్ధ నవమి (సా.08:19వ.కు),**

**నక్షత్రం : శ్రావణం (మ.12:48వ.కు)**

**బ్రహ్మ ముహూర్తం : తె.04:16ల తె.05:04**

**రాహుకాలం : మ.03:13ల సా.04:47,**

**యమగండం : ఉ.08:59ల ఉ.10:32,**

**వర్జ్యకాలం : సా.04:45ల రా.06:34,**

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ : 22 ఏప్రిల్ 2025,**

**ఫజర్ : తెల్లవారుజామున గం. 04:48**

**సూర్యోదయం : ఉదయం గం. 06:01**

**జొహర్ : మధ్యాహ్నం గం. 12:19**

**అసర్ : సాయంత్రం గం. 03:28**

**మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:35**

**ఇష : రాత్రి గం. 07:49**





**జన స్వరం**

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..

అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్

ఫోన్ నెం : 7013030690

మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# జగన్ వచ్చుంటే.. చేతులు కాలాక వైసీపీ ఆవేదన..!



విశాఖపట్నం గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పదవీచ్యుతులయ్యారు. కూటమి పార్టీలు.. రెండు మాసాల ముందు నుంచి చాలా వ్యూహాత్మకంగా ఇక్కడ చక్రం తిప్పి ఆమెను పక్కన పెట్టాయి. కార్పొరేటర్లను ముందు నుంచి కూడా.. తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలు చేశాయి. దీనిని తప్పుబట్టాల్సిన పనిలేదు. అధికారంలో ఉన్నవారు.. అంతే! గతంలో వైసీపీ కూడా ఇలానే చేసిందన్న ఆరోపణలు వున్నాయి. ఇక, అవిశ్వాస పరీక్షలో కూటమి విజయం దక్కించుకుంది. మేయర్‌ను ఓడించింది. ఇక, ఇప్పుడు మిగిలింది.. డిప్యూటీ మేయర్. ఈ క్రతువు కూడా త్వరలోనే పూర్తికానుంది. అయితే.. ఇంత జరిగిన తర్వాత.. వైసీపీ అధినేత జగన్.. తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. టీడీపీని.. చంద్రబాబును తిట్టిపోస్తూ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారంటూ.. కన్నీరు పెట్టుకున్నారు. సుదీర్ఘ లేఖనుకూడా సంధించారు. అయితే.. వాస్తవం ఏంటంటే.. ప్రత్యర్థులు దూసుకువస్తున్నట్టు జగన్‌కు తెలియదా? వైసీపీ హయాంలోని కార్పొరేషన్లను వశం చేసుకునేందుకు.. కూటమి ప్రయత్నిస్తోందని.. తమ కార్పొరేటర్లు కట్టుతప్పుతున్నారని ఆయనకు అవగతం కాలేదా? అంటే.. అయింది. అయినప్పటికీ.. నైరాశ్యం చుట్టుముట్టి.. తన మాటను జవదాటరన్న ఏకైక అతి విశ్వాసం కారణంగా.. తాడేపల్లి గేటు దాటి బయటకు రాలేదు. ఆనాడే నిప్పు రాజుకున్నప్పుడే.. జగన్ స్పందించి ఉంటే.. ఈ సమస్య వచ్చేది కాదు. తనే స్వయంగా వెళ్లి విశాఖ లో కూర్చుని.. పరిస్థితిని అదుపులోకితెచ్చి ఉంటే వేరేగా ఉండేది. కానీ, జగన్ కనీసం ఒక్కసారి కూడా సమీక్షించలేదు. స్థానిక నాయకులతోనూ ఆయన మాట్లాడలేదు. తాను చెప్పాను కదా.. అన్నట్టు వదిలేశారు. క్షేత్రస్థాయి బలమైన కూటమి నాయకులు.. పనిచేస్తున్నారన్న విషయాన్ని గ్రహించలేకపోయారు. మొత్తానికి చేతులు కాల్చుకుని నిప్పులపై ఆవేశ పడినట్టుగా.. ఆక్రోశించి

## ఎడిటోరియల్

నట్టుగా జగన్.. తాను చేయాల్సిన పనిని వదిలేసి.. కట్టు తప్పాక.. చేతులు ఎత్తేశాక..ఇప్పుడు తప్పంతా చంద్రబాబుదేనని.. కూటమిదేనని చెప్పడం నవ్విపోదురుగాక.. అన్న సామెతనే గుర్తు చేస్తోంది. గతంలో ఏ చిన్న పొరపాటు దొర్లుతుందని తెలిసినా.. చంద్రబాబునేరుగా తమ్ముళ్లతో మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. తానే నేరుగా శాసన మండలిలో కూర్చుని.. మూడు రాజధానుల బిల్లుకు వ్యతిరేకంగా తమ్ముళ్లు కదలేలా చేసుకున్నారు. కానీ.. జగన్ చేతులు కాలేవరకు వేచి చూసి.. ఇప్పుడు చంద్రబాబుపై ఏడుపులు పెడబొబ్బలు పెట్టడం ఎంత వరకు సమంజసమో ఆయనే ఆలోచించుకోవాలి.

జమ్ము సాయి కల్యాణ్,
పొలిటికల్ అనలిస్టు,
మేనేజింగ్ డైరెక్టర్,
జనస్వరం మీడియా.



## ఉద్యోగం పేరుతో 10 లక్షలకుపైగా టోకరా... గ్రీవెన్స్‌లో బాధిత మహిళ ఫిర్యాదు

- టీడీపీ నాయకుడి ఇంటి స్థలాన్ని కబ్జా చేసిన వైసీపీ ఎంపీటీసీ, ఆయన బంధువులు
- వైసీపీ నేతలకు అధికారులు సహకరిస్తున్నారంటూ.. వారిపై చర్యలకు వినతి
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు



**మంగళగిరి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** నెల్లూరు జిల్లాలోని వింజమూరు మండలానికి చెందిన గురిజాల వాసు నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలు ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజులకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తాను వింజమూరు టీడీపీ యూనిట్ ఇంఛార్జిగా ఉన్నానని.. తమకు ఇల్లు లేకపోవడంతో ఇంటి స్థలానికి అర్జీ పెట్టుకోగా.. గత టీడీపీ ప్రభుత్వంలో స్థలాన్ని మంజూరు చేస్తే తాము బేస్ మట్టం వరకు ఇంటిని నిర్మించుకున్నామని.. ఆ స్థలాన్ని వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ ఎంపీటీసీ షేక్ కాలేషా అతని బంధువులు ఆక్రమించుకున్నారని.. అప్పుడు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని... ఆ స్థలాన్ని వైసీపీ నేతలకు కట్టబెట్టాలని ఎమ్మార్వో ప్రయత్నించగా తాము లోకాయుక్తకు వెళ్లామని.. దీనిపై అధికారులు తప్పుడు నివేదికలు పంపారని.. తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

– నంద్యాల జిల్లా జలదుర్గంకు చెందిన షేక్ రమిజాబి గ్రీవెన్స్‌లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ... తన కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తన బావ వలి తమ వద్ద రూ.10 లక్షలకు పైగా తీసుకొని మోసం చేశాడని.. అతని నుండి డబ్బులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

– గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన హనుమంతరావు గ్రీవెన్స్‌లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ భూమిని ఆన్ లైన్ చేసి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

– ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామానికి చెందిన వేల్పుల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేస్తూ వేల్పుల శ్రీను అనే రౌడీషీటర్ తమ పొలాన్ని ఆక్రమించుకున్నాడని.. అతని నుండి తమ పొలాన్ని విడిపించాలని విజ్ఞప్తి చేశాడు.

– విశాఖ జిల్లా భీమిలి మండలం టి.నగర్ పాలెంకు చెందిన వెంకట గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి కొనుగోలు చేసిన భూమిని కారుభుక్త వెంకట్రావు అనే వ్యక్తి రికార్డులు తారుమారు చేశాడని దీనిపై విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

– అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామానికి చెందిన తుమ్మల రామకృష్ణ గ్రీవెన్స్‌లో నేతలకు ఫిర్యాదు చేస్తూ.. తమ గ్రామంలోని ప్రభుత్వ భూములకు వైసీపీ నేతలు అక్రమ పట్టాలు తెచ్చుకోగా.. అవి బోగస్ పట్టాలని కలెక్టర్ వాటిని రద్దు చేస్తే.. క్రింది స్థాయిలో అధికారులకు లంచాలు ఇచ్చి మళ్లీ వైసీపీ నేతలు భూములను ఆన్‌లైన్ చేసుకున్నారని దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. – కాకినాడ జిల్లా ఏలేశ్వరంకు చెందిన జి. సత్యవతి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ తన కుమారుడిని హత్య చేస్తే.. తాము పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు తీసుకోవడం లేదని.. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## పాడి రైతులు ఎండాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

- పోతునూరు గ్రామీణ పశు వైద్య కేంద్రం
- జూనియర్ వెటర్నరీ అధికారి సీహెచ్ శ్రీరామ్ దొర



**దెందులూరు, ఏప్రిల్ 21 (జనస్వరం) :** ఎండాకాలంలో పాడి రైతులు తప్పనిసరిగా పశువులకు ఎండ తగలకుండా నీడలో ఉంచాలని కలుషితమైన తాగునీరు ఇవ్వకుండా సురక్షితమైన తాగునీరు పశువులకు అందిస్తూ ఉండాలని పోతునూరు గ్రామీణ పశు వైద్య కేంద్రం జూనియర్ వెటర్నరీ అధికారి సిహెచ్ శ్రీరామ్ దొర అన్నారు. సోమవారం మండలంలోని పోతునూరు గ్రామంలోని గ్రామీణ పశు వైద్య కేంద్రం ఆవరణలో పలు రకాల పశువులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు, పాడి రైతులకు పశు సంవర్తక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై పలు సూచనలు సలహాలు అందజేశారు.

## జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంటు

- నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు మనస్సు పెట్టి పనిచేయాలి
- జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి




**ఏలూరు, ఏప్రిల్ 21 (జనస్వరం) :** జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా నియోజకవర్గాలు వారీగా స్వర్ణాంధ్ర@ 2047 విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకుగాను అధికారులకు రెండు రోజులు పాటు నిర్వహించిన వర్కుషాపులో ఉభయ జిల్లాల చీఫ్ ప్లానింగు అధికారులు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ సిబ్బందితో కలిసి తొలిరోజు వర్కుషాపులో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టరు కె.వెట్రి సెల్వి పాల్గొన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్–2047 డాక్యుమెంటు రూపొందించడంపై జిల్లా కలెక్టరు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా వార్డు, గ్రామ సచివాలయాలు డేటా అనుగుణంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు మనోభావాలు అనుగుణంగా యాక్షన్ ప్లాన్‌కు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. స్వర్ణాంధ్ర విజన్–2047లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుటలో ప్రత్యేక దృష్టి పెట్టారని, ఇప్పటికే కుప్పం, పిఠాపురం, మంగళగిరి, ఉరవకొండ సహా నాలుగు నియోజకవర్గాలకు పైలట్ ప్రాతిపదికన విజన్ డాక్యుమెంట్లు ఇప్పటికే సిద్ధం చేశారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి, ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచి పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దిటకు రాష్ట్రం ప్రభుత్వం కృషి చేస్తోందని, అందుకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ కోసం విజన్, ఆర్థికాభివృద్ధికి కీలక రంగాల పరంగా దృష్టి సారించాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాల పెంపు, సుస్థిర, పర్యావరణ అనుకూలమైన వృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు ఉద్యోగ అవకాశాలు పెంపుదల, భవిష్యత్తు నైపుణ్యాలు, ఉద్యోగాల కల్పనకు, శ్రామికశక్తిని ప్రోత్సహం అందించే క్రమంలో దృష్టి పెట్టాలన్నారు. మహిళా సాధికారత – సంపూర్ణ మహిళా సాధికారత సాధనకు ఉపకరించే అంశాలు, రైతుల ఆకాంక్షలు, బలహీన వర్గాల వారి జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి ప్లాన్‌లో స్పష్టంగా పొందుపరచాలన్నారు. వికసిత్ భారత్ నేపథ్యంలో రాష్ట్రంలో స్వర్ణాంధ్ర@2047 లక్ష్యసాధన కోసం నియోజక వర్గాలు వారీగా సమర్థ వంతంమైన ప్రణాళికలు అందజేయవలసి ఉందన్నారు. ఇందులో భాగంగా రానున్న 5 ఏళ్ల కాలంలో 2029 వరకు ఒక విజన్‌తో కూడిన నివేదిక రూపొందించాల్సి ఉందన్నారు. ఇందుకు జిల్లాలోని ప్రతి శాఖ ఈ లక్ష్యసాధనలో నిర్ణయాత్మక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య రంగాల్లో ప్రస్తుత విస్తరణ, దిగుబడులు, రానున్న రోజుల్లో అంతరసాగు విధానం, ఆదాయం పెంపు, ప్రకృతిసాగు విస్తీర్ణ పెంపు, తదితర అంశాలను ప్రణాళికలో పొందుపరచవలసి ఉందన్నారు. పాల ఉత్పత్తి పెంపుదలకు అవసరమైన అంశాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. పారిశ్రామిక, పర్యాటక రంగ, ఫుడ్ ప్రోసెసింగు యూనిట్ల స్థాపన, వంటి అంశాలను ప్రణాళికలో జోడించాలన్నారు. 2047 నాటికి జాతీయ, ప్రపంచ వేదికలపై ఆంధ్రప్రదేశ్ ఎలాంటి పాత్ర పోషించడం వంటి అంశాలపై, తలసరి ఆదాయం ఎలా పెంచాలి.. తదితర అంశాలు పొందుపరచి విజన్ డాక్యుమెంటు రూపొందించాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అన్నారు. ఈ వర్కుషాపులో ఉమ్మడి జిల్లాల ముఖ్య ప్రణాళిక అధికారులు సీహెచ్ వాసుదేవరావు, కె.శ్రీనువాసరావు, విశ్రాంత జాయింట్ డైరెక్టర్, సీనియర్ ఎకనామిక్ సలహాదారులు డీవీవీ సీతాపతిరావు, నియోజక వర్గాల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులు, సీవీఏపీ సిబ్బంది, ప్లానింగ్ టెక్నికల్ సలహాదారులు జి.దుర్గాప్రసాద్, డి.రామనాథ రెడ్డి, కె.రామ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ హామీలన్నీ తక్షణమే అమలు చేయాలి

**కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించిన సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ**




**నంద్యాల ఏప్రిల్ 21 (జనస్వరం) :** ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీరాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించి అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి కి వినతి పత్రాన్ని అందజేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎం.శంకర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వై నరసింహులు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.అరుణ్ కుమార్ అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం గోపాల్ ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మజీద్ మియా రంగనాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినప్పటికీ ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. వృద్ధాప్య పెన్షన్, ఉచిత గ్యాస్ సిలిండర్ తప్ప మిగిలిన ఏ ఒక్క హామీని కూటమి నేతలు అమలు చేయలేక పోయారన్నారు. ఎన్నికల ముందు నాయకులు ఇచ్చిన హామీలు ఆచరణ సాధ్యం కానీ 176 హామీలను ఇచ్చారన్నారు. తల్లికి వందనం పథకం కింద ప్రతి ఇంటిలో ఎంతమంది విద్యార్థులు ఉంటే ఒక్కొక్కరికి రూ.15 వేలు చెల్లిస్తామని అలాగే 18 నుండి 50 సంవత్సరాలు పైబడిన మహిళకు మహా శక్తి పథకం కింద నెలకు రూ.1500లు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు ఆ ఊసే లేదని ఆరోపించారు. అన్నదాత సుఖీభవ పథకం క్రింద రైతులకు ప్రారంభ పెట్టుబడి కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, గత ఖరీఫ్, రబీ సీజను పూర్తయిందని త్వరలో మరల ఖరీఫ్ సీజను ప్రారంభమవుతుందని, ఇంతవరకు రైతులకు పైస చెల్లించలేదని ఆరోపించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలందరూ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పిస్తామని, మహిళలను మభ్యపెట్టి మహిళా ఓట్లు దండుకున్నారన్నారు. తాను అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తానని అల్లావుద్దీన్ అద్భుతదీపం తన దగ్గర ఉన్నట్లు ఉపన్యాసాలు ఊదరగొట్టి నేడు అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ల అభివృద్ధికి జపం చేస్తూ అమరావతి తారకమంత్రాన్ని జపిస్తూ ఎన్నికల సమయంలో మహిళలకు కార్మికులకు రైతులకు నిరుద్యోగ యువతకు విద్యార్థులకు ఆచరణ సాధ్యం కానీ హామీలను ఇచ్చి ప్రజలను వంచనకు గురిచేసారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి ఎస్.చౌడప్ప, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు, అఖిల భారత రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద్, నాయకులు సులోచన, డివిజన్ కార్యదర్శి మహమ్మద్ భవన నిర్మాణ కార్మిక సంఘం డివిజన్ నాయకులు ఫారుక్, కలాం భాష రఫీ, శంకరయ్య, నాయడు, రఫీ, శివ, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగచారు.. చూడచూడ రుచుల జాడ వేరు...





**పులివెందుల ఏప్రిల్ 21 (జనస్వరం) :** ఒకప్పుడు మజ్జిగ చారు అంటే ఎంతో ప్రసిద్ధి చెందింది. మన పూర్వీకులు అందరూ కూడా చారు పట్ల మక్కువ చూపారు. మజ్జిగ చారు లేదా మజ్జిగ పులుసు అని కూడా పిలుస్తారు. వేసవిలో ఈ మజ్జిగ చారు ప్రతి మనిషికి ఎంతో ఉపయోగపడుతుంది. బిపి షుగర్ థైరాయిడ్ ఉన్నవారు కూడా ఈ మజ్జిగ చారును స్వీకరిస్తారు. మజ్జిగ చారు పుట్టు పూర్వో త్తరాలను ఒక్కసారి తెలుసుకుందాం. మజ్జిగ చారు ఎండాకాలంలో మెజార్టీ పీపుల్ అన్నంలో పోసు కుని తింటుంటారు. అయితే దీనిని ఒక్కొక్కరు ఒక్కో స్టైల్లో చేస్తుంటారు. కానీ ఎవరు ఎలా చేసినా టేస్ట్ మాత్రం చాలా బాగుంటుంది. పైగా ఎక్కువ కష్టపడకుండా చాలా సింపిల్గా ప్రిపేర్ చేసుకోవచ్చు. ఈ క్రమంలోనే మీకోసం వేరే పద్ధతిలో చేసుకునే మజ్జిగ చారు తీసుకొచ్చాం. చాలా అంటే చాలా ఈజీగా, ఎక్కువ కష్టపడకుండానే చేసుకోవచ్చు. పైగా పెద్దగా పదార్థాలు కూడా అవసరం పడదు. అంతేకాకుండా మొదటిసారి చేసే వారు కూడా అదుర్స్ అనిపించేలా చేస్తారు. మరి లేట్ చేయకుండా ఈ మజ్జిగ చారును ఎలా తయారు చేసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం. ఒంట్లో వేడిని తగ్గించే "మజ్జిగ చారు" – ఈ పద్ధతిలో చేస్తే ఘుమఘుమలాడే రుచి! –తినడమే కాదు తాగేస్తారు.

**తయారీ విధానం :**

మిక్సింగ్ బౌల్లోకి పెరుగు తీసుకుని విస్కర్ సాయంతో బాగా చిలకాలి. పెరుగును ఎంత క్రిమీగా చేసుకుంటే మజ్జిగ చారు అంత టేస్టీగా ఉంటుంది. ఇప్పుడు ఈ పెరుగులోకి రుచికి సరిపడా ఉప్పు, సరిపడా నీళ్లు పోసి బాగా కలపాలి. అయితే ఇక్కడ నీళ్ల క్వాంటిటీ అనేది మీరు తినేదానికి అనుగుణంగా కలుపుకోవాలి. ఇలా పెరుగు, ఉప్పు, నీళ్లు బాగా కలుపుకున్న తర్వాత గిన్నెను పక్కన ఉంచాలి. ఉల్లిపాయ ముక్కలను లైట్గా ఫ్రై చేసిన తర్వాత కరివేపాకు, పసుపు వేసి కలిపి మగ్గించిన తర్వాత కలిపి పెట్టుకున్న మజ్జిగ మిశ్రమాన్ని పోసి ఓ నిమిషం పాటు కలిపి స్టవ్ ఆఫ్ చేయాలి. చివరగా కొత్తిమీర తరుగు వేసి సర్వ్ చేసుకుంటే మజ్జిగ చారు ఎంతో కమ్మగా ఉంటుంది. మీరు ప్రయత్నించండి.


# అంగన్వాడీలకు గ్రాట్యుటీ పెంపు హర్షణీయం

- అంగన్వాడీలు చంద్రన్న మానస పుత్రికలు
- అంగన్వాడీలకు ఇచ్చిన అన్ని హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుంది
- జగన్ రెడ్డి పాలనలో అంగన్ వాడీల దుస్థితి దారుణంగా ఉండేది
- నాసిరకం ఆహారం, కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేశారు.. ఎప్పుడు జీతం ఇస్తారో తెలియదు
- జగన్ రెడ్డి పాలనలోలా అంగన్వాడీలు రోడ్డెక్కే పరిస్థితి ఉండదు
- అంగన్వాడీల అభివృద్ధికి చంద్రబాబు ముందుంటారు



**మంగళగిరి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** అంగన్వాడీలకు గ్రాట్యుటీ పెంపుపై టీడీపీ అంగన్వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత హర్షం వ్యక్తం చేశారు. అంగన్వాడీలు చంద్రన్న మానస పుత్రికలని.. వారి సంక్షేమం, అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత దుర్మార్గ ప్రభుత్వంలోలా అంగన్వాడీలు రొడ్డెక్కేల్సిన పరిస్థితి లేదని.. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే మూడు హామీలను అమలు చేశారని.. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తారని తెలిపారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ "గత పాలనలో అంగన్వాడీలు ఏ శాఖ కిందకు వస్తారని ఆ డిపార్ట్‌మెంట్ మంత్రి అడిగారంటే అంగన్వాడీల పట్ల ఆ ప్రభుత్వానికి ఆ ముఖ్యమంత్రికి ఎంత చిత్త శుద్ధి ఉందో అర్థం చేసుకోవాలి. గత ప్రభుత్వం సెంట్రల్ గవర్నమెంట్ మీద తోసి గ్రాట్యుటీ అమలు చేయలేదు. జగన్ పాదయాత్రలో తెలంగాణ కన్నా ఏపీలో జీతాలు ఎక్కువ పెంచుతామని చెప్పి పెంచకుండా మోసం చేశారు. వైసీపీ నేతలు మాటలకే పరిమితం అయితే.. కర్నాటక, గుజరాత్ తరువాత అంగన్వాడీలకు గ్రాట్యుటీని అమలు చేసిన 3వ రాష్ట్రంగా ఏపీ ఉంది. నేడు ప్రభుత్వానికి భారమైనా అంగన్వాడీలకు ఇచ్చి మాట మేరకు గ్రాట్యుటీని కూటమి ప్రభుత్వం పెంచింది. అలాగే అంగన్వాడీలకు అదనపు యాప్‌ల భారాన్ని తగ్గించింది. రూ. 4,200 ఉన్న జీతాన్ని రూ.10,500లకు పెంచిన ఘనత చంద్రబాబుదే. రాష్ట్రం ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నా.. అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుంది.. జగన్ తన పాదయాత్రలో 17 వేల అంగన్వాడీ సెంటర్‌లు నిర్మిస్తామని దొంగ హామీలు ఇచ్చి ప్రభుత్వం వచ్చాక ఒక్క సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయలేదు. 2014 –2019లో దాదాపు 18,500 సెంటర్లను ఏర్పాటు చేసి.. 40 లక్షల మందికి లబ్ధి చేకూర్చిన ఘనత టీడీపీది. అంగన్వాడీలు తమ సమస్యలపై 45 రోజులుగా రోడ్డెక్కి ధర్నాలు చేస్తుంటే.. నాడు జగన్ రెడ్డి, ఆ శాఖ మంత్రి కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. అంతే కాకుండా గత పాలనలో అంగన్వాడీల్లో నాణ్యతలేని ఫుడ్ ను, మురిపోయిన గుడ్లను పంపిణీ చేశారు. నేడు కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన ఆహారాన్ని గర్భిణీలు, పిల్లలకు అందిస్తున్నారు. జగన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు సాధికార సర్వే పేరుతో అంగన్వాడీలను గవర్నమెంట్ ఎంప్లాయిస్ గా పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను కట్ చేశారు. నేడు గత ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాన్ని రద్దు చేసి.. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకానికి అంగన్వాడీలను అర్హులుగా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. జగన్ రెడ్డి పాలనలో ఇచ్చిన ఫోన్లు సరిగ్గా లేక.. అంగన్వాడీలు ఇబ్బంది పడుతుంటే మంచి ఫోన్లు ఇచ్చి ఒక్క యాప్ లోనే అన్ని పనులు చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరం. గత ప్రభుత్వంలో జీతాలకోసం అంగన్వాడీలు ఇబ్బంది పడ్డారు. నేడు ఒకటోవ తేదీనే అంగన్వాడీలు జీతాలు తీసుకుంటున్నారు. చంద్రబాబు నాయుడు అంగన్వాడీల అభివృద్ధికి ముందుంటారు. అంగన్వాడీలు చంద్రన్నకు అండగా ఉండాలి" అని అన్నారు.

## "జనస్వరం" కథనానికి స్పందన..





www.janaswaram.com

పగలే వెన్నెల జగమే ఊయల..

- పట్టపగలు వెలుగుతున్న లైట్లు
- చోద్యం చూస్తున్న నేషనల్ హైవే అధికారులు

**బొంరాస్‌పేట, ఏప్రిల్ 19 (జనస్వరం) :** పూజాఫలం సినిమాలో అక్కినేని నాగేశ్వరరావు సావిత్రి, జమున పాడిన పగలే వెన్నెల జగమే ఊయల అనే పాట గుర్తుకొచ్చేలా బొంరాస్ పేట మండలం తుంకిమేట్ల గ్రామంలోని హైదరాబాద్ బీజాపూర్ 163వ జాతీయ రహదారిపై పట్టపగలే ఆకాశ దీపాలు వెలుగుతున్నాయి. వేసవికాలంలో విద్యుత్‌ను ఆదా చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి పగలు లైట్లు వెలగకుండా రాత్రి పూట మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బొంరాస్‌పేట, ఏప్రిల్ 21 (జనస్వరం) : మండల పరిధిలోని తుంకీమెట్ల గ్రామంలోని హైదరాబాద్ బీజాపూర్ 163వ జాతీయ రహదారిపై "పగలే వెన్నెల జగమే ఊయల" అనే శీర్షికతో "జనస్వరం" కథనం ప్రచురించింది. స్పందించిన జాతీయ రహదారి అధికారులు పగలు లైట్లు బంద్ చేసేలా, రాత్రి వెలిగేలా ఏర్పాటు చేశారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- దేగాం గ్రామంలో ఘటన
- దాదాపు రెండు లక్షల ఆస్తి నష్టం
- మమ్మల్ని అన్ని విధాలుగా అదుకోండి
- అధికారులను వేడుకుంటున్న మగిలి రాజు, లింగవ్వ



**భైంసా ఏప్రిల్ 21 (జనస్వరం) :** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన ఘటన సోమవారం మండలంలోని దేగాం గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం మగిలి రాజు భార్య లింగవ్వకు కొన్ని రోజులు నుంచి ఆరోగ్యం బాగాలేక పోవడంతో మెరుగైన వైద్యం కోసం సోమవారం హైదరాబాద్ వెళ్లారు. మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం అయిందని గ్రామ ప్రజలు అన్నారు. ఇంట్లో ఉన్న ఫర్నిచర్, ఇతర వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. మగిలి రాజు దుబాయ్ నుంచి వచ్చి ఏడు నెలలు అవుతుందని, భార్య వైద్య ఖర్చుల నిమిత్తం అప్పుగా తెచ్చిన రూ.50 వేలు, ఆరు కాసులు బంగారంతో పాటు దాదాపు రూ.2 లక్ష అస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. రెక్క అడితే గాని డొక్కా అడాని పరిస్థితుల్లో ఈ ప్రమాదం కారణంగా కుటుంబం మొత్తం రోడ్డు మీదకు వచ్చేసిందని, మమ్మల్ని అధికారులు అన్ని విధాలుగా అదుకోవాలని వేడుకుంటున్నారు.

## రైతులకు గోనె సంచులు ఇవ్వండి

- రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేయాలి
- ధాన్యం కొనుగోలు సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన చేపడతాం
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు



**ఏలూరు, ఏప్రిల్ 21 (జనస్వరం) :** రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేయాలని, రైతులకు కౌలు రైతులకు వెంటనే గోనె సంచులు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం వారు అన్నే భవనంలో ధాన్యం కొనుగోలు సమస్యలపై మాట్లాడుతూ గోనె సంచులు కొరత వలన అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా చోట్ల ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిందని, గోనె సంచులు లేవని, రైతు సేవా కేంద్రాలు చెప్పడం వలన దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుకు సరిపడా గోనె సంచులు సరఫరా చేయాలని, కళ్ళల్లో ఉన్న ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేసే విధంగా లక్ష్యం నిర్దేశించాలని, లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## నేదురుమల్లి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించండి

### నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడునారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి






**నెల్లూరు, ఏప్రిల్ 21 (జనస్వరం) :** ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రాంతానికి చెందిన మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను, నగర మున్సిపల్ కమిషనర్‌ను కోరినట్లు సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కే సంజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సుధీర్ తెలిపారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నారప రెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. గతంలో ఆంధ్ర రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా (1990–92) పదవి బాధ్యతలు నిర్వహించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ప్రజలకు ఎంతో సేవలు చేసిన మహానుభావుడు, అనేకమంది విద్యార్థులకు, ఉన్నత విద్య అందించేలా ప్రోత్సహించడమే కాకుండా పలు సామాజిక సేవలు అందించారని, నాలుగు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించిన ఏకైక నెల్లూరు రాజకీయవేత్త, దేశ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎంతోమందిని చట్టసభలకు పంపి రాష్ట్ర కేంద్ర మంత్రులుగా తీర్చిదిద్దిన రాజకీయ గురువు నేదుర మల్లి జనార్ధన్ రెడ్డి అని కిరణ్ కుమార్ రెడ్డి కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తికి సిటీ పరిధిలోని కూడలిలో విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించడం సముచితమని, నెల్లూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఇందుకోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలని విగ్రహ ఏర్పాటుకు అయ్యే ఖర్చులను నగర కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేయగలరని కాంగ్రెస్ తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్లు కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో సిటీ ఉపాధ్యక్షులు ఇర్ఫాన్, రూరల్ ఇంచార్జ్ మల్లికార్జున్ రెడ్డి, ధనుంజయ్, సేవాదళ్ సుజాత, బద్రి, సమీర్, రాజశేఖర్ రెడ్డి, రసూల్, నూర్, చాంద్ భాషా, నెహెమ్యా, వరదా రెడ్డి, అంబేద్కర్, వెంకటేశ్వర రెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నాదెండ్లకు ఘన స్వాగతం

### స్వాగతం పలికిన జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు



**ఏలూరు, ఏప్రిల్ 21 (జనస్వరం) :** 3 రోజుల పాటు ఏలూరు జిల్లాలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం ఏలూరుకు విచ్చేసిన పౌర సరఫరాల శాఖ మంత్రి, ఏలూరు జిల్లా ఇంచార్జీ మంత్రినాదెండ్ల మనోహర్‌కి ఏలూరు బైపాస్ వద్ద ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవింద రావు (చినబాబు), గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంతో కలిసి ఆర్టీసీ జోనల్ చైర్మన్, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ రెడ్డి అప్పల నాయుడు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, దెందులూరు సమన్వయకర్త ఘంటసాల వెంకటలక్ష్మి, గోపాలపురం జనసేన ఇంచార్జీ దొడ్డిగర్ల సువర్ణ రాజు, నూజివీడు జనసేన ఇంచార్జీ బర్మా ఫణి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ నగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించండి

### జీహెచ్ఎంసీ అధికారులకు వినతి పత్రం అందజేసిన కాలనీవాసులు




**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** నియోజకవర్గంలోని కొండాపూర్ డివిజన్‌లో గల శ్రీరామ్ నగర్ కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలపై జేఏసీ ఆధ్వర్యంలో ఏ, బీ, సీ బ్లాక్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు స్వచ్ఛందంగా కలిసి జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్, డిప్యూటీ కమీషనర్‌లను వారిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు కాలనీలో సమస్యల గురించి వారికి వివరించారు. కాలనీలో హాస్టల్స్, ఓయో రూమ్స్, లాంటివి, ఫుట్ పాత్, రోడ్డులు ఆక్రమించి పెట్టిన చిరు వ్యాపారాలు, హోటల్స్, టిఫిన్ సెంటర్, వారిని తొలగించి వాహన దారులకు, కాలనీ వాసులకు, అంబులెన్సులు, స్కూల్ బస్సు, ట్యాంకర్స్‌లకు, రాకపోకలకు ఇబ్బంది లేకుండా వాటిని తొలగించాలని వారు కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు విచారణ చేసి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## హైదరాబాద్ నడిబొడ్డున ఆధునిక పూణే గ్యాస్ సంస్థ ఐదో కేంద్రం



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** నగరంలో ది కేఫ్ నీలోఫర్ దార్శనిక అధ్యక్షులు ఎ బాబు రావు ప్రారంభించిన ఈ కొత్త కేంద్రం, వాణిజ్య వినియోగదారులకు పొదుపు, భద్రత, స్థిరత్వానికి భరోసా ఇచ్చేలా స్మార్ట్ గ్యాస్ ఆవిష్కరణలను అందించనుందని తెలిపారు. భారతదేశంలో వాణిజ్య, పారిశ్రామిక గ్యాస్ వ్యవస్థలు, పరిష్కారమార్గాలను అందించటంలో పేరుగడించిన పూణే గ్యాస్, తెలంగాణలో మొట్టమొదటి అంకితమైన వాణిజ్య, పారిశ్రామిక, సహజ వాయువు వ్యవస్థలతో పరిష్కార మార్గాలను అందించే పూణే గ్యాస్ అనుభవ కేంద్రాన్ని హైదరాబాద్లో ప్రారంభించినట్లు ప్రకటించడానికి గర్వపడుతోందని పేర్కొన్నారు. భారతదేశంలో అతిపెద్ద టీ కేఫ్, ఆతిథ్యరంగంలో ఖ్యాతిగడించిన సంస్థ కేఫ్ నీలోఫర్ చైర్మన్ ఎ బాబు రావు సమక్షంలో సోమవారం రోజు ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో పూణే గ్యాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జెసల్ సంపత్, డైరెక్టర్ ఆఫ్ సేల్స్ భవెన్ ఉదేశి, ఇగ్నైట్ ఎల్‌పీజీ, ఫ్రాంచైజ్ ఓనర్ పూణే గ్యాస్ ఎక్స్పీరియన్స్ సెంటర్ సీఈఓ వినయ్ ప్రకాష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూణే గ్యాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జెసల్ సంపత్ మాట్లాడుతూ పూణే గ్యాస్ ఎల్లప్పుడూ ఇంధనాల అన్వేషణల ద్వారా వాణిజ్యాలను మార్చటంలో విశ్వసనీయతను కలిగి ఉందని, తమ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ల ద్వారా మేధో అంతరాన్ని తగ్గించి ప్రతి వాణిజ్య సంస్థ తమ సంస్థ సేవలను సులువుగా పొందే వెసలుబాటు కల్పిస్తున్నామని తెలిపారు. ఇంధన ఖర్చులు పెరగటం, స్థిరత్వ ఆదేశాలు కఠినంగా మారుతుండటం వల్ల పరిశ్రమలు స్మార్ట్, క్లీనర్ ప్రత్యామ్నాయాల వైపు వెళ్లడం చాలా ముఖ్యమని, తమ సంస్థ ఆ ప్రత్యామాయ మార్గాలనే అందిస్తోందన్నారు. ఇంతటి విశేషాలు కలిగిన తొలి సెంటర్‌ను తెలంగాణాలో ప్రారంభించడం తమకెంతో గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. మినర్వా కాఫీ షాప్, బ్రాడ్వేపుడ్ స్టోర్స్ వంటి మేటి సంస్థలు పూణే గ్యాస్ సిస్టమ్స్ సేవల ద్వారా లబ్ధిపొందుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఈ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ చిన్నపాటి క్లౌడ్ కిచెన్ల నుండి భారీస్థాయి ఉత్పత్తిదారుల వరకూ ప్రతి వాణిజ్యానికి లాభాన్ని స్థిరత్వాన్ని అందించగలిగే ఇంధన సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడానికి దోహదపడుతుందన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం





**బొంరాస్‌పేట, ఏప్రిల్ 21 (జనస్వరం) :** వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఏర్పుమళ్ళ, బాపల్లితండా, తుంకిమెట్ల, మెట్లకుంట, బొంరాస్‌పేట, కొత్తూరు, రేగడి మైలారం, వడిచర్ల గ్రామాల్లో ఐకేపీ, డీసీఎంఎస్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయ కృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్ రాములు గౌడ్, అంజిల్ రెడ్డి, మల్లేష్, ఏపీఎం సాయన్న, సీసీలు, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏర్పుమళ్ళ, నాందార్‌పూర్‌లో బడిబాట



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 21 (జనస్వరం) :** మండల పరిధిలోని ఏర్పుమళ్ళ, నాందార్ పూర్ గ్రామాల్లోని పాఠశాల ఉపాధ్యాయులు బడిబాటి పిల్లలను పాఠశాలలో చేర్పిం చడమే లక్ష్యంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి, రామయ్య గ్రామంలో తిరిగి ప్రైవేటు పాఠశాలకు వెళుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు అవ గాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉద యం అల్పాహారం అందించడం జరు గుతుందని మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సర్దార్, కిషన్, ప్రశాంత్, జీవన్ కుమార్, శ్రావణి, జ్యోతి, కుమార్, పంచాయతీ కార్యదర్శి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



# విజయవాడ సమగ్రాభివృద్ధితోపాటు సుందరీకరణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం

**- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**

**- ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి సీసీ రోడ్లు శంకుస్థాపన**

**- 4వ డివిజన్‌లో పలు సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన**



**విజయవాడ, ఏప్రిల్ 21 (జనస్వరం) :** ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆధునీకరణలో విజయవాడ రూపు రేఖలు మారుతున్నాయి. రాజధాని అమరావతి ప్రాంతంలో భాగమైన విజయవాడ నగరాన్ని మరింత సుందరీకరణగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాప్రతినిధులైన తమతో పాటు, ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. అందులో భాగంలోనే విజయవాడ ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, సుజనా చౌదరిలతో కలిసి విజయవాడ సమగ్ర అభివృద్ధితో పాటు సుందరీకరణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. తూర్పు నియోజకవర్గం 4వ డివిజన్ శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ వాటర్ ట్యాంక్ ప్రాంతంలోని రోడ్ నెంబర్ 5కు, భారతి నగర్‌లో 13వ, 14వ, 15వ, 10బీ, 4ఏ రోడ్లకి సుమారు రూ.2 కోట్ల నిధులతో సీసీ రోడ్ల పనులకు సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ విజయవాడ నగరాభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టిపెట్టారని, అందుకే నగరంలోని రోడ్ల అభివృద్ధి పనులు శరగవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇటీవల మంత్రి నారాయణ సీఆర్‌డీఏ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో నగరంలోని డ్రైనేజీ, ఎస్టీపీ సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. అదే విధంగా వర్షం పడిన సమయంలో నోవాటెల్ సమీపంలో ఉన్న రెండు ఫ్లై ఓవర్స్‌కి మధ్య రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయే విషయం, ఫ్లై ఓవర్స్‌కి పైప్ లైన్స్ లేకపోవటంపై నుంచి రోడ్లకి మీదకి నీళ్లు పడే సమస్య నేషనల్ హైవే అధికారుల దృష్టి తీసుకువెళ్లగా త్వరలోనే ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారని తెలిపారు. ఇక నేషనల్ హైవే అథారిటీ అధికారులు బెంజ్ సర్కిల్ నుంచి ప్రారంభించాల్సిన డ్రైనేజీ పనులు నెలరోజుల్లో కార్యరూపంలోకి తీసుకువస్తారని తెలిపారు. విజయవాడ నగరాన్ని మరింత సుందరీణ చేసేందుకు ప్రజాప్రతినిధులందరూ కలిసి కట్టుగా కృషి చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి పర్చటానికి సీఎం చంద్రబాబు ప్రత్యేకమైన శ్రద్ధ వహించారు. నిధుల సమకూర్చి ఈనాలుగున్నరేళ్లలో నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో వున్నారని తెలిపారు. చిన్నపాటి వర్షానికే మునిగిపోయే ఈ ప్రాంతం అభివృద్ధి కోసం సీఆర్డీయే నిధుల నుంచి 200 కోట్ల రూపాయలు మంజూరు చేయటం జరిగిందన్నారు. నిడమానురు, కంకిపాడు నుంచి విజయవాడ లోకి సులువుగా వచ్చేందుకు అవుటర్ రోడ్లు నిర్మాణ అభివృద్ధి పనుల కోసం రూ.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో ప్రధాన సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. రాబోయే రోజుల్లో నగరాభివృద్ధి మాస్టర్ ప్లాన్‌తో పాటు డీపీఆర్ ఇస్తే అవసరమైతే రెండు వేల కోట్ల రూపాయలు సమకూరుస్తానని సీఎం చంద్రబాబు వాగ్ధానం చేశారు. ఆ డీపీఆర్ తయారు చేయటం కోసం ఎంపీ కేశినేని శివనాథ్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలతో కలిసి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో విజయవాడ నగరం భావితరాలకు భవిష్యత్తు ఇచ్చే నగరంగా తయారు కానుందన్నారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు మాట్లాడుతూ విజయవాడ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పనిచేస్తున్నారన్నారు. 4వ డివిజన్‌లో ఆరు సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోనే కాదు విజయవాడలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. విజయవాడ భవిష్యత్తులో ఎలాంటి ముంపుకి గురికాకుండా వుండేందుకు సీఆర్డీఏ అధికారులతో కలిసి కృషి చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, టీడీపీ నాయకులు కోడూరు ఆంజనేయ వాసు, యెర్నేని వేదవ్యాస్, వి.గోపాలకృష్ణ, జి.సురేంద్ర, రాజమణి,మైనేని సాయి బాబు, పిప్రసాద్, జి. నాగేశ్వరరావు, చలసాని రోజా, సర్కిల్ 3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, డీఈపీ రామారావు, ఏఈ దీక్షిత్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాల నీడలో ఎరుపెక్కిన అంకాలమ్మ

**తిరుణాల సందర్భంగా ప్రత్యేకం**



**పులివెందుల ఏప్రిల్ 21 (జనస్వరం) :** నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు కమ్యూనిస్టు పార్టీ నాయకులకు పుట్టినిల్లు. ఒకప్పుడు కామ్రేడ్ పొన్ తోట వెంకట రెడ్డి నేతృత్వంలో అనేక ఉద్యమాలు నడిపారు. అటు వంటి గ్రామంలో హిందువుల ఆరాధ్య దైవమైన అంకాలమ్మ తల్లి తిరుణాల ప్రారంభం అయింది. ప్రతి ఏటా శివరాత్రి పండుగ అనంతరం ఉగాది పండుగ వరకు పలు గ్రామాలల్లో జాతరలు నిర్వహిస్తారు. అయితే ఇక్కడ మాత్రం ఉగాది పండుగ తర్వాత అంకాలమ్మ గూడూరులో నిర్వహించే తిరునాళ్లకు ప్రత్యేకత ఉంది. నాలుగు వారాలపాటు ఈ తిరుణాల నిర్వహిస్తారు. ఈ నాలుగు వారాలలో గురు, ఆదివారాలల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ తిరుణాల మహోత్సవానికి స్థానికంగానే కాకుండా జిల్లా యేతర ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. కడప జిల్లా సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు గ్రామం లో గ్రామ దేవత ఆలయం వెలిసింది. పులివెందుల-సింహాద్రిపురం ప్రధాన రహదారిపై, పులివెందుల నుండి సుమారు 14 కిలోమీటర్ల దూరంలోఈ ఆలయం ఉంది

**అంకాలమ్మ దేవత చరిత్ర :**

అంకాలమ్మ లేదా అంకమ్మ, రాయలసీమ ప్రాంతంలో గ్రామ దేవతగా పూజలందుకుంటారు. ఈమెను శక్తి స్వరూపిణిగా భావించి, గ్రామ ప్రజలు ఆమెను తమ గ్రామాన్ని కాపాడే దేవతగా కొలుస్తారు. అంకాలమ్మ గూడూరులో ఈ దేవతకు ప్రత్యేకమైన స్థానం ఉంది, అక్కడ ప్రతి సంవత్సరం తిరునాళ్లు నిర్వహిస్తారు. ఉగాది పండుగ అనంతరం పదకొండు రోజుల తర్వాత పున్నమి రోజున అంకాలమ్మ తల్లికి కంకణం కడతారు. ఈ సమయంలో అమ్మవారికి చీరకట్టి, పూజలు నిర్వహించబడతాయి. ప్రతి గురువారం ఆదివారం రోజుల్లో భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. ఇటీవల కాలంలో, ఆలయ నిర్మాణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. పాత సంప్రదాయాలు కొంత మేరకు తగ్గిపోయాయి, కానీ భక్తుల నమ్మకం మాత్రం అలాగే కొనసాగుతోంది. ఇప్పటికీ భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తున్నారు ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయం, రాయలసీమ ప్రాంతంలో అంకాలమ్మ తల్లికి అంకితమైన ముఖ్యమైన పుణ్యక్షేత్రాలలో ఒకటి అని పెద్దలు చెబుతారు. ప్రతి ఒక్కరికీ అమ్మవారి దైవనుగ్రహం లభించాలని ఆశిద్దాం.

## జిల్లా ప్రధాన సివిల్ న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ



**ఏలూరు, ఏప్రిల్ 21 (జనస్వరం) :** నూతనంగా నియమితులైన ఏలూరు జిల్లా ప్రధాన సివిల్ న్యాయమూర్తిగా (ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి) పదవీ బాధ్యతలు స్వీకరించిన సిరిపురం శ్రీదేవిని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.పి.ఎస్ కిషోర్ సిరిపురం శ్రీదేవికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం, జిల్లా న్యాయవ్యవస్థ, పోలీస్ విభాగం పరస్పర సహకారంతో ప్రజల కోసం న్యాయం అందుబాటులో ఉండే విధంగా చర్చించారు. ప్రజల న్యాయ అవసరాలు తీర్చేం దుకు సంబంధిత విభాగాల మధ్య సమన్వయంతో కేసుల నివారణ, మహిళా భద్రత, నేర నిరో ధక చర్యలపై కూడా వారు చర్చించారు. సిరిపురం శ్రీదేవి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్య తలు చేపట్టడం పోలీస్ శాఖకు గౌరవ విషయమని పేర్కొంటూ, భవిష్యత్తులో అన్ని రంగాలలో సద్వినియోగదాయకమైన సహకారం అందిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.

## గంగవరంలో వైసీపీ కార్యకర్తల కుటుంబాలకు ముదునూరు పరామర్శ



**ప్రత్తిపాడు, ఏప్రిల్ 21 (జనస్వరం) :** నియోజకవర్గంలోని ప్రమాదాలకు గురైన వైసీపీ కార్యకర్తల కుటుంబాలను సోమవారం ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైసీపీ నాయకులు ముదునూరి మురళి కృష్ణంరాజు ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి వైసీపీ కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించి వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. మొదటిగా రౌతులపూడి మండలం గంగవరం గ్రామంలో వినాయకుడు ఆలయంలోని దర్శనం చేసుకుని వైసీపీ కుటుంబాలను ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వైసీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ రెడ్డి పాలనలో ఉపాధ్యాయ నియామకాలు "గుండు సున్నా"

**- ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదు**

**- ఎమ్మెల్సీ, చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ ఆరోపణ**



**మంగళగిరి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** జగన్ రెడ్డి పాలనలో ఉపాధ్యాయ నియామకాలు గుండు సున్నా అని, ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదని ఎమ్మెల్సీ, చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ ఆరోపించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రజలు జగన్ రెడ్డిని కేవలం 11 సీట్లకు పరిమితం చేసి, ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు. అయినా వైసీపీ ఆత్మపరిశీలన చేసుకోకుండా, రాష్ట్రంలో అనవసర రాద్ధాంతం సృష్టిస్తోందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీ మేరకు 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తే, దాన్ని జీర్ణించుకోలేని జగన్ రెడ్డి సోషల్ మీడియాలో ఫేక్ డీఎస్సీ పోస్టుల పేరిట తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉపాధ్యాయ నియామకాలు ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని, మొత్తం 1,96,000 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు అని ఆమె గుర్తు చేశారు. వైసీపీ పాలనలో ఉపాధ్యాయులను అవమానించారని ఆమె ఆరోపించారు. గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిని అవమానిస్తూ, గురువులను మద్యం దుకాణాల వద్ద కాపలాగా నిలబెట్టారని, మరుగుదొడ్లు శుభ్రం చేయించారని, సిఫార్సు బదిలీల పేరుతో రూ.50 కోట్లు అక్రమంగా వసూలు చేశారని ఆమె తీవ్రంగా విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సరిగా అమలు చేయలేక, ఉపాధ్యాయులపై అనవసర పని ఒత్తిడి తెచ్చారని, ఒక్క నెల కూడా సకాలంలో జీతాలు చెల్లించలేని దుర్మార్గమైన చరిత్ర వైసీపీదని ఆమె దుయ్యబట్టారు. 1998, 2018, 2019 సంవత్సరాల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినట్లు వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని, ఆ సమయంలో అధికారంలో ఎవరున్నారో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని ఆమె సవాల్ విసిరారు. జగన్ రెడ్డి పాలనలో ఉపాధ్యాయ నియామకాలు పూర్తిగా "గుండు సున్నా" అని, ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ, రాష్ట్రంలో అసత్య ప్రచారాలతో గందరగోళం సృష్టిస్తున్న వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి



**పులివెందుల, ఏప్రిల్ 21 (జనస్వరం) :** ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి తెలిపారు. వేముల మండలం కొత్తపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలో మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు తమ పొలాలు ఖాళీగా ఉన్నచో భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. 2025-26 సీజన్‌కు గాను వేముల మండలం మొత్తానికి 528 మట్టి నమూనాలు సేకరించాలని ఉన్నతాధికారులు లక్ష్యం నిర్దేశించారని తెలిపారు. ఒక్కొక్క రైతు సేవ కేంద్రం పరిధిలో దాదాపు 60 మట్టి నమూనాలు సేకరించాలని తెలిపారు. రైతులు తమ పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి, తమ పొలాల్లో నత్రజని, బాస్వరము, పోటాస్ వంటి పోషకాల లభ్యత, ఉదజని సూచిక, లవణ సాంద్రత, సేంద్రీయ కర్బణము మొదలగు పోషకాలు ఎంత పరిమాణంలో ఉన్నాయి అనే విషయాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుకొని పంటలు సాగు చేసినట్లయితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని రైతులకు తెలిపారు. రైతులు స్వచ్ఛందంగా వచ్చి రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సంతోష్, వీఆర్ఏ భాస్కర్ రైతులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు, మారణాయుధాలతో దాడి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోండి

**సర్వేపల్లి జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు వినతి**



**ముత్తుకూరు, ఏప్రిల్ 21 (జనస్వరం) :** సమాజాన్ని విషపూరితంగా మార్చే మాదకద్రవ్యాల వినియోగం, మారణాయుధాలతో తిరుగుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ముత్తుకూరు ఎస్పైకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "యువతను చెడు వ్యసనాలకు బానిసలుగా మార్చి, వారి జీవితాలను నాశనం చేస్తూ, కొంతమంది వ్యక్తులు స్వలాభాల కోసం అగాధానికి తోసిపారేస్తున్నారు. ఇది కేవలం యువత భవిష్యత్తు కాదేగానీ, సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసే ప్రమాదకర పరిస్థితి. కొంతమంది చేతుల్లో మారణాయుధాలు ఉండటం ఎంతో ఆందోళనకరం. తక్షణ చర్యలు తీసుకోవాలి" అని హెచ్చరించారు. "కూటమి ప్రభుత్వం యువతను చెడు మార్గాల నుంచి బయటపడేసేందుకు గట్టిగా కృషి చేస్తోంది. యువతను గాడిలో పెట్టేందుకు కూకటి వేళ్లతో పీకి ప్రయత్నిస్తుంది. మాదకద్రవ్యాల వ్యాప్తికి పాల్పడుతున్న వారిపై మేలుకొలిపి ముందస్తు చర్యలు తీసుకోకపోతే, ఇది గంభీర పరిస్థితులకు దారి తీస్తుంది. ఈ చర్యలు సమాజానికి మంచిది కావు" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు, ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, మండల అధ్యక్షుడు మనుబోలు గణపతి, బోలా అశోక్, శ్రీను, కిషోర్, సందూరి శ్రీహరి, రహమాన్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## కాకాణి గోవర్ధన్ రెడ్డిపై అక్రమ కేసులు దుర్మార్గం

**మేకపాటి రాజగోపాల్ రెడ్డి**




**నెల్లూరు, ఏప్రిల్ 21 (జనస్వరం) :** వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడం దుర్మార్గమని, ఆయనను అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నించడం ప్రగతిశీల ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం నగరంలోని వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ "కాకానిపై కుట్రపూరితంగా కేసులు పెట్టి కోర్టులో బెయిల్ కూడా రాకుండా చేయాలని కుట్రలు సాగుతున్నాయి. కూటమి నేతలు తమ అధికారాన్నే దుర్వినియోగం చేస్తూ, పాలన మరచి, ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టడానికే పరిమితమయ్యారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "రైతుల సమస్యలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రజాసమస్యలపై ధైర్యంగా మాట్లాడుతున్న నాయకుడిగా కాకాని నిలుస్తుండటంతోనే ఆయనపై కేసులు బనాయించడమో దురభిప్రాయం" అని మేకపాటి రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. తన అన్న మేకపాటి రాజమోహన్ రెడ్డిను ఉదహరిస్తూ - "ఆయన మొదటిసారి ఉదయగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు అప్పటి సీఎం ఎన్టీఆర్ కూడా రాజమోహన్ రెడ్డి లాంటి నాయకుడిగా ఉండాలని సభలో ప్రశంసించారు. అప్పుడు రాజకీయాల్లో ఉన్న గౌరవం, ప్రస్తుత చలామణిలో కనిపించకపోవడం బాధాకరం" అని వ్యాఖ్యానించారు. "ఇప్పుడు సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజలకు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని మరిచిపోవడం, గాలికే వదిలేయడం సరి కాదని" విమర్శించారు. "ప్రజలు ఓటేశారు కదా అన్న ఆత్మవంచనలో మునిగిపోయి ప్రజల సమస్యలను విస్మరించడం అన్యాయమని" మేకపాటి అన్నారు. చంద్రబాబు గతంలో తన కుటుంబ సభ్యులకే విశ్వాస ఘాతం చేసిన విషయాలను గుర్తు చేస్తూ - "రామారావు కుటుంబాన్ని ఎలా మోసగించాడో అందరికి తెలిసిందే. ప్రజలను మోసం చేసిన వారు నైతికతపై మాట్లాడటమే అభాసుపాలికరం" అని తీవ్రంగా విమర్శించారు. "ఇంకో నాలుగేళ్లు ఇదే విధంగా శిక్ష అనుభవించాల్సి వస్తుందేమో కానీ, ఇప్పటికైనా మారి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే విధంగా పాలన సాగించాలి" అంటూ హితవు పలికారు.

## బడి పిల్లల కోసం ఇంటింటి ప్రచారం

**కొక్కిరాపల్లి ఎంపీపీ పాఠశాల**



**యలమంచిలి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ వారి ఆదేశాల మేరకు మరియు జిల్లా విద్యాశాఖ అధికారి వారి ఆదేశాల మేరకు కొక్కిరాపల్లి గ్రామంలో బడి ఈడు కలిగిన పిల్లలను బడిలో చేర్పించే నిమిత్తం కొక్కిరాపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పరిధిలో మండల విద్యాశాఖ అధికారి-2 అరుణ్ కుమార్, వార్డ్ కౌన్సిలర్ మజ్జి.రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల పాపాజిరావు, పాఠశాల సిబ్బంది గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాల ద్వారా ప్రభుత్వం నుండి విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఆరో తరగతి నుండి కూడా ఇవ్వడం జరుగుతుంది. బ్యాగు, షూస్, సాక్షులు దుస్తులు కూడా ప్రభుత్వం వారు ఉచితంగా సప్లై చేస్తున్నారని తెలియజేసి బడిలో చేర్చవలసిందిగా తల్లిదండ్రులను కోరారు.

# రైతాంగానికి మేలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### రూ.కోటితో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి రామానాయుడు



**పాలకొల్లు, ఏప్రిల్ 21 (జనస్వరం) :** రాష్ట్రంలో రైతాంగానికి మేలు చేసే పనులతో పాటు, సేవ చేయాలనే తపన కూటమి నాయకుల్లో ఉంటుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. సోమవారం మన రైతు మన రామానాయుడు కార్యక్రమంలో పాలకొల్లు నియోజకవర్గంలో రూ.కోటితో ఉల్లంపరు, జిన్నూరు, వేడంగి గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఉల్లంపరులో రూ.39.20 లక్షలతో ఎస్టీ ఏరియాలో సిమెంట్ రహదారి నిర్మాణం, మరో 39.20 లక్షలతో కొంతేరు ఛానల్ బోధిపై గ్రావెల్ రహదారి, జున్నూరులో 26.10 లక్షలతో రామసేతువ పంట కాలువపై గ్రావెల్ రహదారి, ఇదే కాలువపై రూ 8.10 లక్షలతో మట్టి తవ్వకం, వేడంగిలో రూ 7.30 లక్షలతో మట్టపర్రు ఛానల్ కాలవలో మట్టి తవ్వకం పనులకు కూటమి నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు పట్ల గ్రామస్తులు, రైతులు, మహిళలు సంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి రామానాయుడుకు ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నాడు జగన్ ఐదేళ్ల పాలనలో పంట కాలవలు, డ్రైన్ల పనులకు రూపాయి ఖర్చు పెట్టలేదు, తట్ట మట్టి పని నోచుకోలేదన్నారు. లాకులు, షట్టర్సు, డోర్స్, రోప్పు వంటి వాటికి మరమ్మత్తుల మాట అటునుంచి, కనీసం గ్రీజు పెట్టి మెయింటినెన్స్ పనులు చేసిన పాపాన పోలేదన్నారు. అందుకు ఉదాహరణ నిదర్శనం లక్ష్మీ పాలెం లాకులని తెలిపారు. ఈ లాకులకు సంబంధించి ఒక తలుపు కొట్టుకుపోవడంతో మీరు వెనక్కు వచ్చి నక్కల మురుగు కాలువలో కలిసి వేలాది ఎకరాలను ముంపు గురి చేయడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాజా అవుట్ ఫాల్స్ స్లూయిజ్ పరిస్థితి ఇంతేనన్నారు. ఆనాడు వైసీపీ మంత్రులు ఆర్భాటంగా వచ్చి చూసారే గాని రూపాయి నిధులు మంజూరు చేయలేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవుట్ ఫాల్స్ స్లూయిస్ పనులకు 12 కోట్లతో చేపట్టేందుకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు. చంద్రబాబు పరిపాలనా దక్షతను 16వ ఆర్థిక సంఘ ప్రతినిధులు సైతం కితాబిచ్చారన్నారు. నాడు జగన్ విచ్ఛిన్నం చేసిన రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు శ్రమిస్తున్నారని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, ఎర్రంశెట్టి పద్మారావు, ఉన్నమట్ల కబర్ధి, దేవల్ల రామకోటి మోహన్, దేవరపు దొరబాబు, ఇంటి శ్రీరాములు, కుక్కల సత్యనారాయణ, తులా రామలింగేశ్వర రావు, పితాని వెంకటేష్ దాసరి రత్నరాజు పాలవలస తులసీరావు గిరిగి గోపాలకృష్ణ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు

## 9వ రోజు శ్రీరామరక్ష రథయాత్ర





**యలమంచిలి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించిన శ్రీరామరక్ష రథయాత్ర అచ్చుతాపురం మండలంలో 9వ రోజు వెదురువాడ, గొర్ల ధర్మవరం, వెంకటాపురం, లంక ధర్మవరం, దెబ్బపాలెం ఎస్ఈజడ్ కాలనీ లలో ఆనందోత్సాహాలతో శ్రీరామరక్ష రథాన్ని హారతులు ఇచ్చే గ్రామాల్లోకి కోలాటాలతో భజనలతో ఆహ్వానించి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పీల్లా రమా కుమారి పర్యవేక్షణలో జరిగింది. ఎవరికి ఏ ఇబ్బంది కలగకుండా వాలంటీర్లు పనిచేశారు. ఈ కార్యక్రమంలో రాజన సన్యాసినాయుడు, బయలు పూడి శ్రీరామదాసు, చేకూరి శ్రీనివాసరాజు, కొల్లి అప్పారావు, ఈశ్వరరావు, సర్పంచులు ఎంపీటీసీలు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా టీడీపీ కార్యాలయంలో కీర్తిశేషులు అంబటి బ్రాహ్మణయ్య వర్ధంతి



**విజయవాడ, ఏప్రిల్ 21 (జనస్వరం) :** స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, మాజీ ఉమ్మడి కృష్ణ జిల్లా పార్టీ అధ్యక్షులు అంబటి బ్రాహ్మణయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా బ్రాహ్మణయ్య చిత్రపటానికి రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి సింహాద్రి కనకాచారి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి సింహాద్రి కనకాచారి మాట్లాడుతూ బ్రాహ్మణయ్య సర్పంచ్‌గా ప్రారంభమైన రాజకీయ ప్రస్థానం సమితి అధ్యక్షుడిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఉమ్మడి కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షులుగా పార్టీకి ఎనలేని సేవలు అందించారన్నారు. ముక్కుసూటి నాయకుడని, నీతి నిజాయితీకి నిలువుటద్దం బ్రాహ్మణయ్య అని కొనియాడారు. ఉమ్మడి కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షునిగా, నియోజకవర్గ నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. రాజశేఖర్ రెడ్డి అవినీతి, అరాచక పాలనకు నిరసనగా జిల్లాలో పాదయాత్ర, సైకిల్ యాత్రలను నిర్వహించి కార్యకర్తల్లో గుండె ధైర్యాన్ని నింపారన్నారు. పార్టీ అదేసించిన ప్రతి కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించడానికి ఆయన వంతు కృషి చేసే వారన్నారు. బ్రాహ్మణయ్య లాంటి నాయకుడిని ఆదర్శంగా తీసుకొని నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పామర్తి కిషోర్ బాబు, కోడూరు ఆంజనేయ వాసు, దేవరపల్లి ఆంజనేయులు, బత్తుల దుర్గారావు, వాకా వెంకటేశ్వరరావు గౌడ్, మహమ్మద్ హాఫీజ్ రహిమాన్,అబ్దుల్ మాబుద్, జాస్తి సురేష్,మన్నెం పోతరాజు, గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంటలమ్మ తల్లి వార్షికోత్సవం



**కిర్లంపూడి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** మండలంలోని పాత కృష్ణవరం గ్రామంలో మంటలమ్మ తల్లి నాలుగో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు అంతా కలిసి నదీ జలాలు తెచ్చి గ్రామమంతా తిరుగుతూ ఆలయాన్ని చేరుకుని స్వయంగా మహిళలంతా ఎవరి కలశం వాళ్ళు ఆ నీళ్లతో అమ్మవారి అభిషేకం చేశారు. స్వయంగా అమ్మవారికి నీళ్లతో అభిషేకం చేయడం ఈ గ్రామ సంప్రదాయంగా వస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం లలితా పారాణి కార్యక్రమం మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## మైహోమ్ ఇండస్ట్రీస్‌లో వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**యలమంచిలి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** మండలంలోని ములకలాపల్లి గ్రామంలోని మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ఫ్యాక్టరీ), శ్రీనగర్ కాలనీలో గల శ్రీశ్రీశ్రీ వ్యూహ లక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 20వ తేదీ నుండి 23వ తేదీ వరకు జరుగుతున్న బ్రహ్మోత్సవాల రెండవ రోజు సోమవారం ఉదయం యాగశాలలో ద్వారతోరణ ధ్వజకుంభ ఆరాధన, చతుస్థానార్చన, మహాకుంభ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, మూలమంత హవన పారాయణాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. మధ్యాహ్నం తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు యాగశాలలో నిత్యారాధన, హవన కార్యక్రమాలు కొనసాగగా, రాత్రి 7 గంటలకు శ్రీ శ్రీనివాస కళ్యాణోత్సవం సందర్భంగా ఎదుర్కోలు ఉత్సవం భక్తి శ్రద్ధలతో జరగిందని ఫ్యాక్టరీ సీనియర్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్) బి.రామస్వామి తెలియజేశారు. మంగళవారం (ఏప్రిల్ 22) బ్రహ్మోత్సవాల మూడవ రోజు స్వామివారి కళ్యాణం అనంతరం అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మైహోమ్ గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వరరావు శ్రీకుమారి దంపతులు, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివారి మంగళాశాసనములతో పాల్గొననున్నారని నిర్వాహకులు వెల్లడించారు.

## అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం

- అక్రమ మైనింగ్ వాహనాలను వెంబడించి పట్టుకున్న ఎమ్మెల్యే
- రెవిన్యూ అధికారులను పిలిపించి అప్పగించిన వైనం
- మైనింగ్ మాఫియా ఉదయగిరిని విడిచి వెళ్ళండి లేదంటే వెంబడిస్తా.
- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్






**నెల్లూరు, ఏప్రిల్ 21 (జనస్వరం) :** ఎమ్మెల్యే నిఘా నేత్రంతో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను వెంబడించి పట్టుకున్న సంఘటన వింజమూరు మండలం నల్లగొండ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామ సమీపంలో ఉన్న నల్ల కొండ వద్ద గత కొద్ది రోజులు నుండి అక్రమంగా గ్రావెల్ తరలించి డంపింగ్ చేసుకుంటున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి రెండు రోజుల క్రితం వచ్చింది. బిజీ షెడ్యూల్లో ఉన్న ఎమ్మెల్యే ఖాళీ సమయాన్ని చూసుకొని సోమవారం 11 గంటల సమయంలో ఎవరికి సమాచారం ఇవ్వకుండా నల్లగొండ్ల గ్రామానికి చేరుకున్నారు. అక్కడ సీక్రెట్ ఆపరేషన్ చేసి వాహనాలను వెంబడించి పట్టుకొని ఆ తర్వాత అధికారులకు ఫోన్ చేసి వారిని పిలిపించి వాహనాలను అప్పగించారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కొంతమంది పని కట్టుకొని నా పేరు చెప్పుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. వారికి అధికారులు కూడా సహకరిస్తున్నట్లు సమాచారం, నేను ఎప్పుడూ ఎవరికీ చెప్పను, ఏదైనా అత్యవసరమైతే నేనే డైరెక్ట్‌గా మాట్లాడుతా, నేను మాట్లాడితేనే తీసుకోండి, నా పేరు చెప్తే వినకండి, అని అధికారులకు మాస్ వార్నింగ్ ఇచ్చారు. అలసత్యం ప్రదర్శిస్తూ అక్రమాలకు తావిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వింజమూరు మండలం నల్ల గొండ్ల గ్రామంలో ఉప సర్పంచ్, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ పంచాయతీ తీర్మానం కూడా ఇస్తామని చెప్పి మరి అక్రమ గ్రావెల్ తవ్వకానికి పాల్పడ్డారన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియజేసినట్లు తెలిపారు. వీరి సొంత లాభానికి నాకు మాట తెస్తున్నారని దీనిని ఎట్టి పరిస్థితుల్లో సహించబోను అని తెలిపారు. ఉదయగిరిని మైనింగ్ మాఫియా విడిచి వెళ్లాలని లేదంటే వెంబడిస్తానని హెచ్చరించారు. నియోజకవర్గ ప్రజలు కూడా మన విలువైన సంపదను మనమే కాపాడుకోవాలని అన్ని చోట్లకు నేను రాలేనని, గ్రామస్థాయిలోనే అరికట్టాలని పిలుపునిచ్చారు. అవసరమైన సమయంలో నాకు సమాచారం అందించాలని తెలియజేశారు. అధికారులు కూడా అప్రమత్తంగా ఉంటూ ఇటువంటి వాటికి తావు లేకుండా చూడాలని హితవు పలికారు.

## రైతుల ఖాతాలో పావలా వడ్డీ నిధులను జమ చేయండి

### ఏపీజీబీ చైర్మన్‌కు ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి లేఖ



**పులివెందుల, ఏప్రిల్ 21 (జనస్వరం) :** రైతుల ఖాతాలో పావలా వడ్డీ నిధులను జమ చేయాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్‌కు ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి లేఖ రాశారు. లేఖలోని సారా ంశం ఇలా ఉంది. రాష్ట్రంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులు పది జిల్లాల పరిధిలో ఉన్నాయి. లక్ష లాది మంది రైతులు బ్యాంకు ఖాతాదారులుగా ఉన్నారు. అలాగే పంట రుణాలను కూడా తీసు కువచ్చారు. రైతులు మొత్తం ఏడు శాతం వడ్డీ కడితే అందులో రాష్ట్ర ప్రభుత్వం 3 శాతం (పావలా) వడ్డీని రైతులకు వెనక్కు ఇచ్చారు. రుణాల రెన్యూవల్ సమయంలో రైతులు వడ్డీ కడితే ప్రభుత్వం తర్వాత పావలా వడ్డీ యెంత అవుతుందో అంత రైతుల ఖాతాలలోకి జమ చేశారు. రాష్ట్రంలో వున్న అన్ని బ్యాంకులు రైతులకు రావలసిన పావలా వడ్డీ నిధులను రైతుల ఖాతాలలోకి జమ చేశారు. ఒక్క ఏపీజీబీ మాత్రం ఇంకా జమచేయలేదు. పంట రుణాలను రెన్యూవల్ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. గత ఏడాది దుర్భిక్ష పరిస్థితులతో రైతులు దెబ్బ తిన్నారు. ప్రభుత్వం కూడా నిధులను మీకు అందించారు. మనవి చేయడమే మనగా రైతులకు రావాల్సిన పావలా వడ్డీ నిధులను వెంటనే రైతుల ఖాతాలలోకి జమ చేయాలని ఆ లేఖలో కోరారు.

## పది వారాల ఉపాధి పనులు బకాయిలు విడుదల చేయాలి



**యలమంచిలి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** మండలం రేగుపాలెం గ్రామంలో సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ నాయకులు ఆర్.రాంబాబులు ఉపాధి హామీ పనులును పర్యటించారు. సుమారు పది వారాల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ యలమంచిలి మండల కార్యదర్శి చింతకాయల శివాజీ మాట్లాడుతూ రేగుపాలెం గ్రామంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కార్మికులకు సుమారు 10 వారాల నుండి బిల్లులు చెల్లించకపోవడం దుర్మార్గమని, నెలల తరబడి బకాయిలు ఉంచితే కార్మికులు ఎలా బతుకుతారని, గతంలో పని ప్రదేశాల్లో టెంట్లు, మజ్జిగ మంచినీరు ఏర్పాటు చేశారని, ఇప్పుడు అటువంటి ఏమీ చేయడం లేదని, అందువలన కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, కేంద్ర ప్రభుత్వం ఉపాదామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తుందని, అందులో భాగంగానే బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్, కార్మికులు పాల్గున్నారు.

## ఉర్దూ పాఠశాలని ఎంపీయూపీ పాఠశాలల్లో విలీనం వద్దు

- ఉర్దూ పాఠశాలని యధావిధిగా కొనసాగించాలి
- ఉర్దూ పాఠశాల చైర్మన్ పఠాన్ షానావాజ్



**నెల్లూరు, ఏప్రిల్ 21 (జనస్వరం) :** జిల్లాలోని ఏఎస్ పేట మండల కేంద్రంలో ఉన్న ఉర్దూ పాఠశాలను ఎంపీయూపీ పాఠశాలలో విలీనం చేయవద్దని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్‌కు ఉర్దూ పాఠశాల చైర్మన్ పఠాన్ షానావాజ్, పఠాన్ సందాని ఖాన్, ఎస్ఎం బాషా అలియాస్ గండువారిపల్లి భాష పలువురితో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉర్దూ పాఠశాల చైర్మన్ పఠాన్ షానావాజ్ మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలను ఎంపీయూపీ పాఠశాలలో విలీనం చేయడం వలన ఉర్దూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అందరూ ఎంతో నష్టపోతారని, ఈ పాఠశాల కనీసం 70 సంవత్సరాల నుండి ఎంతోమంది విద్యార్థులకు ఎన్నో రంగాలలో రాణించే విధంగా తీర్చిదిద్దిందని, అలాగే ముస్లిం సోదరుల జనాభా ఎక్కువ ఉన్న ఏఎస్ పేటలో ఉర్దూ పాఠశాల ఎంతో అవసరమన్నారు. ఉన్నత అధికారులు ఈ విషయంపై స్పందించి.. ఉర్దూ పాఠశాల విలీనాన్ని ఆపి.. యధావిధిగా ఉర్దూ పాఠశాలను కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఆదిదంపతులకు సహస్ర దీపాలంకరణసేవ

### స్వామివార్లకు వైభవంగా వెండి రథోత్సవం





**శ్రీశైలం, ఏప్రిల్ 21 (జనస్వరం) :** శ్రీశైలభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లకు సోమవారాన్ని పురస్కరించుకొని సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. దేవస్థానం సేవలో భాగంగా ముందుగా ఆలయ ప్రాంగణంలోని అతిపురాతన మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికను వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులను చేసి అర్చక, వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో పూజలు జరిపించి, పూజల అనంత రం (వెయ్యి దీపాలను వెలిగించి) సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. అనంతరం ఉభయ దేవాలయాల ప్రాంగణంలో శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజు (సోమవారం) కావడంతో స్వామి వార్లకు వైభవంగా వెండిరథోత్సవసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా వెండిరథోత్స వాన్ని శోభాయమానంగా అలంకరించి స్వామివార్ల ఉత్సవమూర్తులను వేంచేపు చేయించి శాస్రో క్తంగా విశేష క్రతువు నిర్వహించి వైభవంగా ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహించారు. ఈసేవల్లో ఆలయ అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అరండల్ పేట సీఐ ఆరోగ్యరాజును మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు



**గుంటూరు సిటీ, ఏప్రిల్ 21 (జనస్వరం) :** నగరంలోని అరండల్ పేట పోలీస్ స్టేషన్‌కు ఇటీవలే స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా బాధ్యతలు స్వీకరించిన కె. ఆరోగ్యరాజును జనసేన పార్టీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య, నగర కార్యదర్శి కల్లగంటి త్రిపుర, యువజన నాయకుడు యర్రగోపుల జయదీప్‌లతో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉప్పు వెంకటరత్తయ్య మాట్లాడుతూ "నీతి, నిజాయితీతో విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు న్యాయం అందించే విధంగా పోలీస్ వ్యవస్థను నడిపించడంలో ఆరోగ్యరాజు ఎప్పటికీ ఆదర్శంగా నిలిచారు. ఆయన మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాం" అని అన్నారు.

# అట్టహాసంగా ముగిసిన ఎస్ఎస్ఎస్ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్

**విజయవాడ, ఏప్రిల్ 21 (జనస్వరం) :** స్థానిక జోజినగర్ అనిల్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో సితార గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఎస్‌ఎస్ఎస్ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ అంగరంగ వైభవంగా ముగిసింది. మొత్తం 32 జట్లు పాల్గొన్న ఈ పోటీలు గత ఎనిమిది రోజులుగా ఉత్కంఠభరితంగా కొనసాగాయి. ఫైనల్ మ్యాచ్ అనంతరం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమంలో విజేతలైన కార్తీక్ సీసీ (గొల్లపాలెం గట్టు) జట్టుకు లక్ష రూపాయల ప్రైజ్ మనీని సుజనా ఫౌండేషన్ తరపున అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన పెనమలూరు అమ్మ క్యాటరింగ్ సీసీ జట్టుకు ఎంఎస్ బేగ్ సంస్థ తరపున రూ.50,000 నగదు బహుమతి లభించింది. వ్యక్తిగత ప్రతిభకుగాను మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డును వర్మ, బెస్ట్ బౌలర్ అవార్డును దిలీప్ అందుకున్నారు. ఈ అవార్డులను జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష చేతుల మీదుగా అందజేశారు. వారిద్దరికి తలో రూ.7,000 నగదు బహుమతి లభించింది. ఈ సందర్భంగా ఎంఎస్ బేగ్ ప్రతినిధి మాట్లాడుతూ "క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు, టీమ్ వర్క్ నేర్పించేందుకు మంచి వేదికగా నిలుస్తాయి. ఇలాంటి టోర్నమెంట్‌లను నిర్వహించడం అభినందనీయం" అని అన్నారు. జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష మాట్లాడుతూ ' ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నిరంతరం కృషి చేస్తూ, రాష్ట్రంలోని క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు అందించేందుకు విశేషంగా పాటుపడుతున్నారు. ఆంధ్ర క్రికెట్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకు రావడమే లక్ష్యంగా శివనాథ్ పలు కీలక ప్రయత్నాలు చేస్తున్నారు. వారి మార్గదర్శకత్వంలో రాష్ట్రం నుంచి మరిన్ని యువ క్రికెటర్లు జాతీయ స్థాయికి ఎదుగుతారనే విశ్వాసం ఉంది. యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మా తరపున సహకారం అందిస్తాం. అని పేర్కొన్నారు. అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ "ఐపీఎల్ తరహాలో ఈ లీగ్‌ను సుజనా ఫౌండేషన్, కేశినేని ఫౌండేషన్, ఎం ఎస్ బేగ్ ట్రస్ట్‌ల సహకారంతో నిర్వహించడం గర్వకారణం" అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సుజనా ఫౌండేషన్ ఆపరేషన్స్ కో ఆర్డినేటర్ వీరమాచినేని కిరణ్, ఇంచార్జ్ హరీష్, ఎన్డీఏ కూటమి నేతలు యేదుపాటి రామయ్య, కప్పగంతుల శివశర్మ, సుధాకర్, కాకాని తరుణ్, కనకారావు, ఏలూరు సాయి శరత్, పగడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# పోప్ ఫ్రాన్సిస్ జీవితం సేవా దృక్పథానికి నిదర్శనం

### పోప్ మృతికి ఎంపీ కేశినేని శివనాథ్ సంతాపం

**విజయవాడ, ఏప్రిల్ 21 (జనస్వరం) :** "పోప్ ఫ్రాన్సిస్ తన జీవితాన్ని సహనం, ప్రేమ, వినమ్రతతో మానవాళి సేవకే అంకితం చేశారు. కేవలం కాథలిక్ సంఘానికే కాదు ప్రపంచ వ్యాప్తంగా అన్ని మతాల మధ్య సౌహార్దాన్ని పెంపొందించేందుకు ఆయన చేసిన కృషి అపూర్వం. పేదలు, వలసదారులు, పర్యావరణ పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు ఆయన సేవా దృక్పథానికి నిదర్శనం. పోప్ ఫ్రాన్సిస్ మరణం మానవతావాదులకు విశ్వశాంతి కోరేవారికి కాదు ప్రపంచానికే తీరని లోటు" అని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మానవాళి సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన పోప్ ఫ్రాన్సిస్ ప్రపంచ శాంతి కోసం ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా శోకంతో నిండివున్న క్రైస్తవ సమాజానికి తన ప్రగాఢ సానుభూతి తెలియపర్చారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఏసుప్రభువును ప్రార్థించారు.

# శంఖవరం ఏపీ మోడల్ స్కూల్‌లో విజయవంతంగా ప్రవేశ పరీక్ష



**శంఖవరం, ఏప్రిల్ 21 (జనస్వరం) :** శంఖవరం మండలంలో నేడు ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం సీఎస్ వైఎస్వి కిరణ్, డిఓ జి శేఖర్ (మండపం హెచ్‌ఎం) ఆధ్వర్యంలో నిర్వహించారు. పరీక్షకు మొత్తం 289 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 240 మంది పరీక్షకు హాజరయ్యారని ఇంచార్జ్ ప్రిన్సిపల్ వైఎస్వి కిరణ్ తెలియజేశారు. వాతావరణం తక్షణం వేడిగా ఉండటంతో, విద్యార్థుల కోసం చల్లటి నీటి ఏర్పాటు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి స్టాఫ్ అందరూ సహకరించారని, వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఏంఈఓ ఎస్వీ రమణ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పరీక్ష ఫలితాలను ఈ నెల 27న విడుదల చేస్తామని ఇంచార్జ్ ప్రిన్సిపల్ వైఎస్వి కిరణ్ చెప్పారు.


# పీఎండీఎస్ విత్తనాలు వేయటం వలన భూమి సారవంతం అవుతుంది

### డీఎంఎంటీ సత్తిబాబు



**శంఖవరం, ఏప్రిల్ 21 (జనస్వరం) :** భూమిలో పీఎండీఎస్ విత్తనాలు వేయడం వలన నేల సారవంతం అవుతుందని డీఎంఎంటీ మద్దూరి సత్తిబాబు అన్నారు. కాకినాడ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) ఎలియాజర్ ఆదేశాల మేరకు మండల కేంద్రం శంఖవరం గ్రామంలో ఆదివారం డీఎంఎంటీ సత్తిబాబు ఆధ్వర్యంలో ఐసీఆర్‌పీలు నాగ వెంకటలక్ష్మి, కామేశ్వరి ఐదుగురు రైతులతో 10 ఎకరాలలో పీఎండీఎస్ (30 రకాలతో కూడిన) విత్తనాలు చల్లించారు. ముత్తుం గోవిందు, ముత్తుం అప్పారావు, అడపా వెంకటేశ్వరరావు, కర్రి సత్తిబాబు, రేలంగి వెంకన్న అనే రైతులతో విత్తనాలు చల్లించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంఎంటీ సత్తిబాబు మాట్లాడుతూ రుతుపవనాలు రాక ముందు, వరి కోతలకు ముందు రైతులు పొలాలను సారవంతం చేసుకునే విధంగా పీఎండీఎస్ విత్తనాలు చల్లుకోవాలని, దీని వలన నేలలోని కర్బన శాతం పెరుగుతుందని, నేలలో జీవవైవిధ్యం పెరుగుతుందని, బహుళ పంటల వలన నేలలో కలుపు ఉండదని, ప్రధాన పంట వాతావరణ వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం ఉంటుందన్నారు. నేలలో నీటిని నిలువ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# ప్రముఖ గాంధీయవాది పశుపతిరావు మృతి



**ఉప్పలగుప్తం, ఏప్రిల్ 21 (జనస్వరం) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజవర్గం, ప్రముఖ గాంధీ వాది సత్తి పశుపతిరావు(90) చల్లపల్లి గ్రామంలో స్వర్గస్తులైయ్యారు. గాంధీజీ ఆదర్శ భవాలతో అహింస విధానాన్ని ఆచరిస్తూ ది ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ ఖాదీ, రూరల్ డెవలప్మెంట్ సంస్థ రావులపాలెంలో మాజీ మేనేజర్‌గా పనిచేశారు. సత్తి తాతమ్మ నరసవేణి దంపతులకు కోనసీమ జిల్లాలో సవరప్పాలెం గ్రామంలో 23 ఫిబ్రవరి 1936 సం.లో జన్మించారు. రావులపాలెంలో 1977 సంవత్సరంలో మేనేజర్‌గా పనిచేస్తున్న సమయంలో 250 మంది మహిళలకు, వందమంది నేతవారికి ఉపాధి పొందేలా అంబర్ చరఖా సెంటర్ను లాభాల బాటలో నడిపినారు. అలాగే విశాలమైన భవన నిర్మాణం కొరకు ఐదు కుంచాల మేర స్థలాన్ని సంస్థకు ఉచితంగా ఇప్పించేలా గ్రామ కమిటీని ఒప్పించడంలో సఫలీకృతం కాగా అలాగే తనవంతుగా రెండు స్థలాన్ని కొనుగోలు చేసి సంస్థకు ఉచితంగా రాసి ఇవ్వడం ప్రధాన పాత్ర పోషించడంతో అప్పటి గ్రామ పలువురు ప్రముఖులచే ప్రశంసలు పొందారు. ఈయన మరణానికి ప్రముఖ ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు సవరపాలెం గ్రామస్తులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

# డా. పసుపులేటి హరి ప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జనసేన నేతలు



**తిరుపతి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** జనసేన పార్టీ పీఏసీ సభ్యులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు, తిరుపతి బోధ్ హాస్పిటల్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్‌కు జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. జనసేన పార్టీ రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ దారం అనిత, దారం హరి ప్రసాద్ కలిసి హరి ప్రసాద్‌ని మర్యాదపూర్వకంగా కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి దీవెనలతో హరి ప్రసాద్ ఆరోగ్యంగా, సుఖంగా ఉండాలని, ఇంకా అధికంగా ప్రజాసేవలో ముందుండాలని మనసారా కోరుకుంటున్నాం," అని పేర్కొన్నారు. డా. హరి ప్రసాద్ ప్రజలతో మమేకమై, మెగా కుటుంబానికి సన్నిహితుడిగా, ప్రజాసేవలో తనదైన ముద్రవేసిన నాయకుడిగా పేరుగాంచారని వారు తెలిపారు.

# వైభవంగా అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు ఎల్.సాంప్రసాద్ జన్మదిన వేడుకలు



**విజయవాడ, ఏప్రిల్ 21 (జనస్వరం) :** అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షులైన ఎల్. సాంప్రసాద్ జన్మదినం సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం యాలమంచిలి సత్యనారాయణ సుజనా చౌదరి కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను మధు, మస్తాన్, గౌరీ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్. కృష్ణ ప్రసాద్, జనసేన నాయకులు వేవిన నాగరాజ్, రేలంగి బుజ్జి, కూరాకుల సురేష్, రాజా నాయుడు, జిల్లెల్ల అనీలు, ముద్రబోయిన దేవకి, కొమ్మూరి అరవింద్ తదితరులు హాజరై సాంప్రసాద్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సాంప్రసాద్ యువతలో సేవా స్ఫూర్తిని రగిలించేందుకు చురుకైన పాత్ర పోషిస్తున్నారని, ఆయన నాయకత్వం మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని హాజరైన అతిథులు ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి సందడి చేసిన ఈ వేడుకలు సాంప్రదాయబద్ధంగా, ఉత్సాహంగా సాగాయి.

# టీడీపీ కేంద్ర కార్యాలయంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- నా పొలం లీజుకు తీసుకుని మట్టి తవ్వుకుపోతున్నారు
- ఎమ్మెల్యే చింతమనేని, ఆయన అనుచరులే పాత్రధారులు
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేసినా పరిష్కారం కాలేదు
- మణికట్టు కోసుకున్న బాధితుడు బాబూరావు
- అడ్డుకుని మణిపాల్ ఆస్పత్రికి తరలించిన సిబ్బంది

**అమరావతి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** టీడీపీ కేంద్ర కార్యాలయంలో దాసరి బాబూరావు అనే వ్యక్తి సోమవారం ఆత్మహత్యాయత్నం చేశారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆయన అనుచరులు కలిసి తన పొలాన్ని లీజుకు తీసుకుని.. అనుమతి లేకుండా మట్టి తవ్వుకుపోతున్నారని ఆయన ఆరోపించారు. బాబూరావు తన భార్య నాగలక్ష్మితో టీడీపీ కార్యాలయానికి వచ్చారు. దెందులూరు మండలం చల్ల చింతలపూడిలో సర్వే నంబరు 12/2, 13/4లోని తమ పదెకరాల పొలాన్ని మాయమాటలతో చల్లచింతలపూడి మాజీ సర్పంచ్ సత్యనారాయణ లీజుకు తీసుకున్నారని, ఆ పొలం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తోలుకుపోతున్నారని.. ఈ వ్యవహారంలో చింతమనేని, ఆయన అనుచరులు కీలకంగా ఉన్నారని తెలిపారు. పదెకరాల్లో ఇప్పటికే 4 ఎకరాల్లో మట్టి తవ్వేశారని వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. గనుల శాఖ తనకు రూ.1.25 కోట్లు ఫైన్ వేసిందని తెలిపారు. ఈ వ్యవహారంపై టీడీపీ గ్రీవెన్స్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని, ఇక ఆత్మహత్యే శరణమ్యంటూ మణికట్టు కోసుకున్నారు. టీడీపీ కార్యాలయ సిబ్బంది అడ్డుకుని ఆయన్ను మణిపాల్ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

# సాగు పనిముట్ల పంపిణీలో తీవ్ర జాప్యం

- పథకం అమలులో వెనుకబడ్డ 22 జిల్లాలు
- అధికారులపై అగ్రి డైరెక్టర్ ఢిల్లీరావు ఆగ్రహం

**అమరావతి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** రాష్ట్రంలో గత ఐదేళ్లూ రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. 40-50 శాతం రాయితీపై రైతులకు అందించాలని సీఎం చంద్రబాబు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు నిర్దేశించారు. కానీ క్షేత్రస్థాయిలో అధికారులు ఈ పథకం అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దరఖాస్తు చేసిన రైతులకు పరికరాలు అందించడంలో తాత్సారం చేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 42వేల వ్యక్తిగత పనిముట్లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీటి కోసం గత నెలాఖరు వరకు దాదాపు 20 వేల మంది రైతుల దరఖాస్తు చేశారు. అందులో 13వేల మంది రైతులు తమ వాటా సొమ్మును చెల్లించారు. ఇంత వరకు సబ్సిడీ కింద ప్రభుత్వం రూ.28 కోట్లు విడుదల చేసింది. వీరందరికీ పరికరాలు అందాల్సి ఉండగా, ఇప్పటి వరకు సగం మందికి కూడా అందించలేదు. అల్లూరి, కాకినాడ, పశ్చిమగోదావరి, తిరుపతి జిల్లాలు మాత్రమే రాష్ట్రసరాసరి 54%లక్ష్యం దాటాయి. మిగతా 22 జిల్లాలు లక్ష్యసాధనలో పూర్తిగా వెనుకబడ్డాయి. దీనిపై వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు సోమవారం వ్యవసాయ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అసహనం వ్యక్తం చేశారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలు కూడా వెనుకబడటంపై అధికారులను ఆయన వివరణ కోరారు. లోపం ఏస్థాయిలో ఉందో గుర్తించాలని, పాలనాపరమైన ఇబ్బందులేమిటో వ్యవసాయ, ఆగ్రోస్ అధికారులు లోతుగా విశ్లేషించి, రైతులకు సత్వరమే రాయితీ పరికరాలు అందించాలని ఆదేశించారు. కాగా రాయితీ పరికరాలకు పేర్లు నమోదు చేయాలన్నా, కంపెనీల నుంచి పనిముట్లు తెప్పించాలన్నా.. క్షేత్రస్థాయి సిబ్బంది రైతుల నుంచి ముడుపులు కోరుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొందరు మండల స్థాయి అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో ఎవరికీ అందించకుండా తాత్సారం చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

# శ్రీవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ



**తిరుమల, ఏప్రిల్ 21 (జనస్వరం) :** సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం తర్వాత అఖిలాండం వద్దకు చేరుకుని కొబ్బరికాయ సమర్పించి నమస్కరించుకున్నారు.

# చినకలవలాపల్లిలో వడ్డీ వ్యాపారి హత్య

- రాత్రి మేడపై నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు దాడి
- తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావంతో మృతి



**రాంబిల్లి, ఏప్రిల్ 21 (జనస్వరం) :** మండలంలోని చినకలవలాపల్లిలో వడ్డీ వ్యాపారి ఒకరు హత్యకు గురయ్యాడు. ఆదివారం రాత్రి మేడపై నిద్రించడానికి వెళ్లిన ఆయన సోమవారం ఉదయం తీవ్ర గాయాలతో రక్తపుమడుగులో పడివున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడి వుంటారని పోలీసు భావిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ నరసింగరావు వెల్లడించిన వివరాలిలా వున్నాయి. చినకలవలాపల్లికి చెందిన జల్లి తాతారావు (65) స్థానికంగా వడ్డీ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. పిల్లలకు గతంలోనే వివాహాలు అయ్యాయి. భార్యతో మనస్పర్థలు రావడంతో ఆమె ప్రస్తుతం రాజమహేంద్రవరంలో వుంటున్నది. ఇక్కడ తాతారావు ఒక్కడే నివాసం వుంటున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసిన అనంతరం ఇంటి మేడపైకి వెళ్లి పడుకున్నాడు. సోమవారం ఉదయం సుమారు ఎనిమిది గంటల ప్రాంతంలో కేబుల్ టీవీ సిబ్బంది కేబుల్ సరిచేసేందుకు తాతారావు ఇంటి మేడపైకి ఎక్కారు. అక్కడ రక్తపుమడుగులో విగతజీవిగా పడివున్న తాతారావును చూసి కుటుంబ సభ్యుకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నరసింగరావు, ఎస్ఐ నాగేంద్ర, సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లారు. తాతారావు మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను, ఇరుగుపొరుగు వారిని వాకబు చేశారు. తరువాత పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. క్లూస్‌టీమ్, డాక్‌స్క్వాడ్ వచ్చి పలు ఆధారాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఆదివారం రాత్రి తన ఇంటి మేడపై పడుకొన్న తాతారావుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి, తలపై బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడన్నారు. ప్రాథమిక ఆధారాల ప్రకారం తాతారావుది హత్యగా భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. తాతారావు కుమారుడు జల్లి అప్పలరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.